ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు




పుష్కరఘాట్‌లో మహిళల కార్తీక దీపారాధన





చేర నీ పాద దీపం..

తూర్పుగోదావరి జిల్లా కడియపులంకలో కార్తీక సోమవారం పర్వదినాన కోటి దీపోత్సవం నిర్వహించారు. శివపార్వతుల శాంతి కల్యాణం, ఆంజనేయస్వామి నక్షత్రపూజలు వైభవోపేతంగా జరిగాయి. వేదమంత్రాల మధ్య శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి ఆంజనేయస్వామి ఆలయకమిటీ అధ్యక్షుడు పల్ల సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో అఖండ దీపారాధన ప్రారంభించారు. - కడియం


జాంపేట శివయ్య

కాపాడు.. కార్తీక దామోదరా..

పవిత్ర గోదావరి తీరం హరహర మహాదేవ.. శంభో శంకరా అంటూ దేవదేవుడి నామ స్మరణతో మారుమ్రోగింది. కార్తీక మాసం సోమవారం మహాశివుడికి అత్యంత ప్రీతికరమైన రోజు కావడంతో భక్తులు వేకువజాము రెండుగంటల నుంచే కోటిలింగాల రేవు, చింతాలమ్మఘాట్ ,పుష్కరాల రేవు, సరస్వతి ఘాట్, గౌతమి ఘాట్లలో కార్తీక స్నానమాచరించి దీపాలు నదిలో వదిలారు. కాపాడు కార్తీక దామోదరా అంటూ వేడుకున్నారు. - రాజమహేంద్రవరం సిటీ


పుష్కరఘాట్‌లో భక్తజనం




పీజీఆర్ఎస్‌లో అర్జీదారుల సమస్యలు వింటున్న కలెక్టర్ కీర్తి చేకూరి, జేసీ మేఘా స్వరూప్

అర్జీలు వెంటనే పరిష్కరించాలి

పీజీఆర్ఎస్‌లో కలెక్టర్ కీర్తి చేకూరి

రాజమహేంద్రవరం రూరల్ నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను పరిశీలించి నాణ్యతతో కూడిన పరిష్కారం చూపించాలని కలెక్టర్ కీర్తి చేకూరి అధికారులకు సూచించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో ప్రజల నుంచి 200 అర్జీలను స్వీకరించారు. అర్జీదారులు తమ సమస్యలను కలెక్టర్‌కు విన్నవించుకున్నారు. మొంథా తుఫాన్ కారణంగా గతవారం పీజీఆర్ఎస్ రద్దు చేయడంతో ఈ వారం తాకిడి పెరిగింది. పెద్ద ఎత్తున అర్జీదారులు కలెక్టరేట్‌కు చేరుకున్నారు. చాలీచాలనీ ఇరుకు సందులో తోసుకుంటూ అర్జీలు పట్టుకుని క్యూకట్టారు. చివరకు కలెక్టర్ వద్దకు చేరుకుని తమ సమస్యను విన్నవించారు. గతంలో ప్రతి సోమవారం బస్టాండ్ నుంచి కలెక్టరేట్‌కు ఒక బస్ సర్వీసు ఉండేది. ప్రస్తుతం దానిని నిలుపుదల చేయడంతో ఆటోలకు డబ్బులు చెల్లించలేక అర్జీదారులు ఇబ్బందిపడుతున్నారు. కలెక్టర్ ప్రతి సోమవారం ఒక బస్ సర్వీస్ ఉండేలా చర్యలు తీసుకోవాలని అర్జీదారులు కోరారు. ఇటీవల మొంథా తుఫాన్ ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కొన్న అధికారులను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో జేసీ వై.మేఘాస్వరూప్, డీఆర్వో టీ సీతారామమూర్తి, డీఎస్పీ విద్య, సీపీవో ఎల్.అప్పలకొండ తదితరులు పాల్గొన్నారు.

పనులు వేగవంతం చేయాలి

జిల్లాలో జల్ జీవన్ మిషన్, స్వచ్ఛభారత్ మిషన్ పథకాల క్రింద మంజూరైన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశించారు. కలెక్టరేట్‌లో జల్‌జీవన్ మిషన్ పనులపై సమీక్షించారు. జల్ జీవన్ మిషన్ కింద రూ.2,315 కోట్లతో 1168 పనులు మంజూరయ్యాయని వీటిలో 190 పనులు పురోగతిలో ఉన్నాయని తెలిపారు. 2026 మార్చి నాటికి పనులు పూర్తి చేయాలన్నారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ గిరి, జడ్పీ డిప్యూటీ సీఈవో రాంగోపాల్ పాల్గొన్నారు.


సమస్య వింటున్న ఎస్పీ నరసింహ కిశోర్

ఎస్పీ గ్రీవెన్స్‌కి 40 ఫిర్యాదులు

రాజమహేంద్రవరం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం పబ్లిక్ గ్రీవెన్స్ నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులతో ఎస్పీ నరసింహ కిశోర్ మాట్లాడి 40 అర్జీలు స్వీకరించారు. అర్జీదారుల సమస్యలపై ఆరా తీశారు. సంబంధిత పోలీస్‌స్టేషన్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ఆయా ఫిర్యాదులపై సూచనలు చేశారు.

అక్రమంగా సాగినా : నాడు పోలవరం కాలువ గట్టు వద్ద మట్టి తరలింపు(ఫైల్)





మట్టి పెట్టేశారు!

కొండలు కరిగాయ్

అనుమతుల్లేకుండా మింగుడు..

- ఉమ్మడి జిల్లాలో పోలవరం మట్టిని మింగేశారు
- రూ.350 కోట్లకుపైగా మట్టి మాయం
- కోట్లు వెనకేసుకున్న వైసీపీ నేతలు
- ప్రభుత్వం మారి ఏడాదిన్నర
- అక్రమార్కులపై ఇంత వరకూ చర్యల్లేవ్
- తాజాగా రూ.300 కోట్లు మట్టి దోపిడీ
- పశ్చిమ,కృష్ణా జిల్లాల్లో అధికారుల నిర్ధారణ

(కాకినాడ,ఆంధ్రజ్యోతి) ఒకటి కాదు రెండు కాదు కాదు..ఏకంగా రూ.350 కోట్లు.. గత ప్రభుత్వ హయాంలో ఉమ్మడి జిల్లాలో కొందరు వైసీపీ నేతలు కొల్లగొట్టేసిన పోలవరం మట్టి విలువ ఇది. అధికారం అండతో అనుమతుల్లేకుండా రియల్ ఎస్టేట్, ఇళ్ల స్థలాల చదునుకు అడ్డగోలుగా విక్రయించి సంపాదించింది అంతకుమించే. ఈ మట్టిని బొక్కేసిన అక్రమార్కులపై ఇప్పటికీ కనీస చర్యలు లేకపోవడం విస్మయపరుస్తోంది. ప్రభుత్వం మారిన వెంటనే దీనిపై విచారణ జరుగు తుందని భావిస్తే ఇంతవరకు ఆ ఊసే లేదు. ఒకరకంగా చెప్పాలంటే అప్పటి మట్టి అక్రమా లను మట్టుపెట్టేశారనే ఆరోపణలు వ్యక్త మవు తు న్నాయి. తాజాగా ఉమ్మడి పశ్చిమ, కృష్ణా జిల్లాల్లో వైసీపీ హయాంలో పోలవరం మట్టి అక్రమ తవ్వకాలు రూ.300 కోట్లు అని నిర్ధారణ అయిన నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో చోటు చేసుకున్న రూ.350 కోట్ల అక్రమ తవ్వకాల సంగతేంటనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి.

కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల పరిధిలో పోలవరం ఎడమ ప్రధాన కాలువ వందల కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. సీతానగరం మండలం పురుషోత్తపట్నం దగ్గర మొదలయ్యే ఈ కాలువ గోకవరం, కోరుకొండ, రాజానగరం, గండేపల్లి, ప్రత్తిపాడు, జగ్గంపేట, గొల్లప్రోలు, శంఖవరం, తొండంగి, తుని మండలాల మీదుగా పయనిస్తోంది. గత టీడీపీ ప్రభుత్వంలో ఈ కాలువను 18 మీటర్ల లోతు వరకు తవ్వారు. దీంతో దాదాపు నాలుగు కోట్ల క్యూబిక్ మీటర్ల మట్టి వచ్చింది. కాలువ వెంబడి భూముల్లో 15 అడుగుల ఎత్తు వరకు మట్టి మేటలు వేశారు.2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక క్రమేపీ ఆ మట్టి కొండలు కరిగిపోతూ వచ్చాయి. అప్పటి అధికార పార్టీ ఎమ్మెల్యేలు, ఇతర నేతలు ఈ మట్టిపై వాలిపోయారు. ప్రధానంగా రాజానగరం, ప్రత్తిపాడు, పిఠాపురం, తుని నియోజకవర్గాల పరిధిలో పోలవరం మట్టిని వైసీపీ ఐదేళ్లలో వేలాది టిప్పర్లలో తరలించేశారు. టిప్పర్ మట్టిని రూ.8 వేలకు కాకినాడ, రూ.12 వేలకు తాళ్లరేవు, యానాం, రూ.4 వేలకు పిఠాపురం, రూ.15 వేలకు కోనసీమలో అనేక రియల్‌ఎస్టేట్ స్థలాల చదునుకు విక్రయించి కోట్లు గడించేశారు. ప్రత్తిపాడు,పిఠాపురం నియోజకవర్గాల పరిధిలో చెందుర్తి జాతీయరహదారి పక్కనే పోలవరం కాలువ వెంబడి కోటిన్నర లక్షల క్యూబిక్‌మీటర్ల మట్టి మేటలు,తునిలో 70 లక్షలకుపైగా క్యూబిక్‌మీటర్ల మట్టి నిల్వలను కాజేశారు. దీనంతటినీ అప్పట్లో ముగ్గురు ఎమ్మెల్యేలు తమ అనుచరుల ద్వారా యథేచ్ఛగా తరలించుకుపోయారు.

నిబంధనల ప్రకారం పోలవరం కాలువ మట్టిని తవ్వాలంటే జలవనరులశాఖ అనుమతి తీసుకోవాలి. కానీ గత వైసీపీ ప్రభుత్వంలో అనుమతుల్లేకుండానే మట్టి కొండలు కొల్లగొట్టారు.గనులు, జలవనరులశాఖ అధికారులు కమీషన్లు పుచ్చుకుని కళ్లు మూసుకోవడంతో పోలవరం మట్టి 95 శాతానికి పైగా మాయమైపోయింది. ఒక ప్పుడు భారీ మేటలున్న ప్రాంతాల్లో ఇప్పుడు ఖాళీ స్థలాలు కనిపిస్తున్నాయి. తూర్పుగోదావరి, కాకినాడ జిల్లాల్లో ఆరున్నర కోట్ల క్యూబిక్ మీటర్ల మట్టి మాయమైపోయింది. పిఠాపురం నియోజకవర్గం యు.కొత్తపల్లి మండలం కొమరిగిరిలో 350 ఎకరాల్లో అప్పటి సీఎం జగన్ చేతుల మీదుగా 2021 డిసెంబర్ 25న పేదలకు ఇళ్లస్థలాలు పంచారు. ఈ భూములు సముద్రానికి అతిసమీపంలో లోతట్టులో ఉన్నాయి. ఈ లేఅవుట్‌ను లక్షల క్యూబిక్ మీటర్ల మట్టితో చదును చేశారు. ఇందుకోసం గొల్లప్రోలు మండలం చెందుర్తి జాతీయరహదారిని ఆనుకుని ఉన్న పోలవరం కాలువ మట్టిని అప్పటి కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి వేలాది టిప్పర్లలో తరలించి కోట్లలో మెక్కేశారు. అప్పట్లో కాకినాడ కీలకనేత ఒక్కరే పోలవరం మట్టిలో రూ.6 కోట్ల వరకు మింగేశారు.

ఎందుకిలా..

ప్రభుత్వం మారి దాదాపు ఏడాదిన్నరవుతోంది. కానీ ఇంతవరకు పోలవరం మట్టి అక్రమాలపై ప్రభుత్వం కనీసం దృష్టిసారించలేదు. రూ.350 కోట్లకుపైగా విలువైన మట్టిని అప్పటి నేతలు అక్రమంగా అమ్మేసుకున్నా ఇంత వరకు విచారణ చేపట్టకపోవడంతో అక్రమార్కులు దర్జాగా ఉన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరిలో పోలవరం మట్టిని వేలం వేస్తే రూ.350 కోట్ల వరకు రాబట్టవచ్చని 2019లో అధికారులు లెక్కగట్టారు. కానీ అప్పటి ప్రభుత్వం ఈ మట్టంతా తమ పార్టీ నేతలకు దోచిపెట్టింది. పైగా ఈ దోపిడీపై అప్పట్లో ప్రతిపక్ష హోదాలో టీడీపీ పోరాటం చేసింది. ఇప్పుడు చేతిలో అధికారం ఉన్నా కనీసం మట్టి అక్రమాలపై విచారణకు ఆదేశించకపోవడం విమర్శలకు తావిస్తోంది.

మట్టిలో కలిపేశారా?

కాకినాడ నగరంలో గత వైసీపీ హయాంలో రూ.450 కోట్లకుపైగా విలువైన టీడీఆర్ బాండ్ల జారీపై విజిలెన్స్ నివేదిక సిద్ధమైంది. రేషన్ బియ్యం కుంభకోణంపై సిట్, ఆడుదాం ఆంధ్రా అవినీతిపై విజిలెన్స్ విచారణ చేపట్టింది. పోలవరం మట్టి అక్రమాలపై ఏ విచారణ లేదు. ఉమ్మడి పశ్చిమ, కృష్ణా జిల్లాల్లో 1.21 కోట్ల క్యూబిక్ మీటర్లు రూ.300 కోట్ల విలువైన పోలవరం మట్టి దోపిడీకి గురైందని తాజాగా అక్కడ జలవనరుల శాఖ అధికారులు నిర్ధారించారు. కానీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో రూ.350 కోట్లకుపైగా విలువైన మట్టిని మింగేసిన అక్రమార్కులపై కనీసం అధికారులు కూడా ఉలకడం లేదు. దీంతో పోలవరం మట్టి అక్రమాలను మట్టుపెట్టేశారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

సూపర్ మాయ!



అంతంతమాత్రంగా సూపర్ జీఎస్టీ అమలు

- కానరాని జీఎస్టీ తగ్గింపు
- పాత ధరలకే అమ్మకాలు
- పాత స్టాకు పేరిట దోపిడీ
- మోసపోతున్న కొనుగోలుదారు
- అధికారుల చర్యలు శూన్యం
- ఆన్‌లైన్‌లోనూ అయోమయం

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి) కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ నుంచి సామాన్యులకు భారీ ఉపశమనం కలిగించి నెల దాటింది. ఇప్పటికీ సూపర్ జీఎస్టీ ఫలాలు సామాన్యుడికి దక్కడం లేదు. ప్రభుత్వాల ఆదేశాలతో యంత్రాంగం ఓ వారం హడావుడి చేసి చతికిలబడింది. మొన్నటి వరకూ పండుగ ఆఫర్లు అంటూ ఊదరగొట్టిన వ్యాపారులు.. ఇప్పుడు ప్రత్యేక తగ్గింపు అంటూ యథావిధిగా మోసపు ఉదారత చాటుకుంటున్నారు. మరి తగ్గిన జీఎస్టీ ఎంత? అసలు అంతకు ముందు ధర ఎంత? కేంద్ర ప్రభుత్వం తమకు కల్పించిన మేలుతో లాభం ఎంత సమకూరింది? అనే ప్రశ్నలకు సమాధానం ప్రశ్నగానే ఉండి పోతోంది. వ్యాపారులు మాత్రం తమ చాకచక్యాన్ని ప్రజలపై రుద్దుతూనే ఉన్నారు. కేంద్ర ప్రభుత్వం మాత్రం గతంలో ఉన్న ఐదు స్లాబులను రెండుకు తీసుకొచ్చాం..జనానికి భారీగా ఒనగూరుతుందని చెప్పింది. ఈ ధరల మోళీ జీఎస్టీ సూపరట! సేవింగ్స్ ఎక్కడట? అనే సందేహాన్ని నివృత్తి చేయలేక పోతోంది.ఈ గందరగోళం నడుమ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో రోజుకు జనం కోట్లాది రూపాయలు నష్టపోతూనే ఉన్నారు.

వ్యాపారుల మాయాజాలం..



జీఎస్టీ తగ్గక ముందు ఎంత ధర, తర్వాత ఏ మేరకు తగ్గిందనే విషయాలు దుకాణాల్లో ఎక్కడా కనబడడం లేదు. ఆన్‌లైన్ ప్లాట్‌ఫాంలలో అయితే అంతా అయోమయమే నడుస్తోంది. అసలు ధరను అమాంతం పెంచేసి భారీ తగ్గింపును చూపిస్తుంటారు. ఇప్పుడు కూడా ఆ మాదిరిగానే ధరలు ఉండడంతో జీఎస్టీ వల్ల తమకు ఏమి ఒరిగిందో వినియోగదారుడికి బోధ పడడం లేదు. మొన్నటి వరకూ పండుగ ఆఫర్ల పేరుతో అంతా కలగాపులగం చేసే శారు. జీఎస్టీ తగ్గింపు ఎంత, వ్యాపారి ఇస్తున్న ఆఫర్ ఎంత? అనే వాటిపై స్పష్టత లేకుండాపోయింది. జీఎస్టీని కేంద్ర ప్రభుత్వం భారీగా తగ్గించింది. గతంలో ఐదు స్లాబులుగా ఉన్న పన్నులను 5, 12% రెండు స్లాబులకు తెచ్చింది. దీనిలో కారుల నుంచి బిస్కట్ల వరకూ దాదాపు 375 వస్తువులపై 5 నుంచి 10 శాతం వరకూ పన్నుపోటు తగ్గింది. కొన్నిటికి పన్ను సున్నా చేశారు. అయితే ఆ మేరకు వినియో గదారుడికి ఎంత లబ్ధి చేకూరిందో సూపర్ జీఎస్టీ అమల్లోకి వచ్చి నెల దాటినా స్పష్టత కొరవడింది. ఆన్‌లైన్ ప్లాట్‌ఫాంలలో మరీ దారుణంగా పరిస్థితి నడుస్తోంది. వాస్తవ ధర నిర్ధారణలో స్పష్టత లేకపో వడంతో రూ.5 విలువ చేసే పెన్‌ని రూ.5 వేల ధర చూపించి 99 శాతం డిస్కౌంట్ ఇచ్చేస్తున్నామని రూ.50 ధర పెడుతున్నారు. దీని వల్ల ఇప్పుడు జీఎస్టీ ఎంత తగ్గించారో కూడా తెలియడం లేదు.

మందుల్లో మోళీ..

ఇవాళ మందుల ఖర్చు చూసి రోగం మరింత ముదిరిపోతోంది. ఓ వైపు అధిక శాతం డాక్టర్లు మందులతో చీటీలను పూర్తిగా నింపేస్తుంటే.. మరోవైపు మందుల దుకాణాల వాళ్లు ఎడాపెడా దోచేస్తున్నారు. చాలా ఆస్పత్రుల్లో సొంత మెడికల్ షాపులు అదనపు వ్యాపారంగా మారిపోయింది. బయట షాపుల్లో ఎమ్మార్పీపై ఏకంగా 20 శాతం వరకూ తగ్గింపు ఇస్తామంటూ వ్యాపారస్తులు పోటీ పడుతుంటారు. ఆస్పత్రుల్లోని మెడికల్ షాపుల్లో ఆ రాయితీ వర్తించడం లేదు. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం మందులపై జీఎస్టీని గణనీయంగా తగ్గించింది. అత్యవసర మందులపై పన్ను ఎత్తేసింది. కానీ ప్రజలకు మాత్రం ఆ మేరకు జేబుకు ఆదా కనబడడం లేదు.ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 3 వేల వరకూ మందుల షాపులు ఉండగా.. 150 వర కూ పెద్ద దుకాణాలు ఉన్నాయి. అత్య వసర మందులతో పాటు సాధారణ మందులను ఒకే చీటీలో రాస్తారు. దీంతో సందట్లో సడేమియా మాదిరిగా అత్యవసర మందులకు జీఎస్టీ తగ్గింపు ఇవ్వడం లేదు.



అంతా గందరగోళం

దుకాణదారులు జీఎస్టీ మార్పులను అమలు చేయడం లేదు. ఏదో ఒకటి రెండు వస్తువులపై తగ్గింపును చూపుతూ అధిక శాతం వస్తువులపై దోపిడీ సాగుతోంది. కిరాణా తదితర సరుకుల విషయంలో ఇదే నడుస్తోంది. కొందరు వ్యాపారులు పాత స్టాకు, పాత ధరలకే హోల్‌సేల్‌గా కొన్నా మంటూ ధరలు తగ్గించకపోవడం గమనార్హం. సబ్బులు, టూత్‌పేస్ట్, బిస్కట్లు, లేస్, బింగోస్ వంటి వాటి విషయంలో ఎఫ్ఎంసీజీ కంపెనీలు ధరలు తగ్గించలేదు. అయితే వీటి పరిమాణాన్ని పెంచామని చెబుతూ గందరగోళానికి తెరలేపుతున్నాయి. పాలు, ఆహార పదార్థాలు, హోటళ్లు, నిత్యావసరాల్లో వేటిపై జీఎస్టీ ఎంత తగ్గిందో ఇప్పటికీ అయోమయంగానే ఉంది. సెప్టెంబరు 22 నుంచి సూపర్ జీఎస్టీ అమల్లోకి రాగా ఓ వారం రోజులు అధికారులు పరుగులు పెట్టారు. తర్వాత యథావిధిగా పట్టు వదిలేశారు.

జీఎస్టీ తగ్గలేదా.. ఫిర్యాదు చేయండి

జీఎస్టీ అమలుకాని పక్షంలో కొనుగోలుదారుడు ఫిర్యాదు చేసే అవకాశం ఉంది. ఈ విషయం చాలా మందికి తెలియదు. తగ్గిన పన్నుల ప్రకారం ధరలు నిర్ణయించి అమ్మకాలు సాగించకపోతే కొనుగోలుదారుడు నేషనల్ యాంటీ ప్రాఫెటరింగ్ అథారిటీకి ఫిర్యాదు చేయవచ్చు. అయితే ఇలాంటి ఒక సంస్థ ఉందని వందలో ఒక్కరికి కూడా తెలియని పరిస్థితి ఉంది. ఇప్పటికీ దీనిపై యంత్రాంగం అవగాహన కల్పించలేదు. అసలు అధికారుల్లో అధిక శాతం మందికి ఆ సంస్థ గురించి తెలియదు. బిల్లులు ఇవ్వకపోయినా వాణిజ్య పన్నుల శాఖ పట్టించుకున్న దాఖలాలు లేవనే చెప్పవచ్చు. అటు ఔషధ నియంత్రణ శాఖ అసలు ఉందా? అనే తీరు కనబరుస్తోంది.

జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా సత్యనారాయణ

నాలుగు రోజుల సస్పెన్స్‌కు తెరదించిన అధికారులు



రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధనాసుపత్రి (జీజీహెచ్) సూపరింటెండెంట్‌గా జనరల్ మెడిసిన్ హెచ్‌వోడీ డాక్టర్ పీవీవీ. సత్యనారాయణను నియమిస్తూ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ ఉన్నతాధికారులు సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. పూర్తి అడిషనల్ చార్జ్ (ఎఫ్ఏసీ) హోదాలో ఆయన జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తించనున్నారు. రాజమహేంద్రవరం మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా కొనసాగుతూ, జీజీహెచ్‌కు ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా వ్యవహరించిన డాక్టర్ సౌభాగ్యలక్ష్మి గత నెల 31వ తేదీన ఉద్యోగ విరమణ చేసిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి జీజీహెచ్‌కు ఎవరినీ సూపరింటెండెంట్‌గా నియమించలేదు. అత్యవసర సేవల్లో అత్యంత ప్రధానమైన, వైద్యపరమైన పాలనా విధులను పర్యవేక్షించాల్సిన ఈ కీలకమైన పోస్టు విషయంలో ఉన్నతాధికారులు మీనమేషాలు లెక్కించారు. చివరకు నాలుగు రోజుల సస్పెన్స్‌కు తెరదించుతూ డాక్టర్ పీవీవీ సత్యనారాయణను సూపరింటెండెంట్‌గా నియమించారు. ఆయన మంగళవారం బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉంది.



ఏబీసీలో ఏం చేస్తున్నారు?

కుక్కలు పెరిగాయ్.. బాధితులు పెరిగారు.. ఏ వీధిలో అడుగుపెట్టినా వందల్లోనే కుక్కలు దర్శనమిస్తున్నాయి.. దీంతో భయపడుతూ వెళ్లాల్సిందే. వీధి కుక్కలకు కు.ని శస్త్రచికిత్సలు చేస్తున్నారా అంటే అదీలేదు.. రాజమహేంద్రవరంలో ఆపరేషన్లు చేయడానికి ఒక ప్రత్యేక కేంద్రమే ఉంది. అయినా ఆ దిశగా అధికారులు చేపట్టిన చర్యలు శూన్యం.. అమాసకో.. పున్నానికో గుర్తుకొచ్చినప్పుడు తప్ప కు.ని ఆపరేషన్ల జోలికి వెళ్లరు.. లెక్కల్లో మాత్రం ప్రతిరోజూ చేస్తున్నట్టే చూపిస్తారు.. ఈ మేరకు ఫిర్యాదు అందిందో ఏమిటో కానీ సోమవారం కమిషనర్ రాహుల్ మీనా ఆకస్మికంగా ఏబీసీ (యానిమల్ బర్త్ కంట్రోల్) సెంటర్‌ను తనిఖీ చేశారు. కేంద్రంలో సిబ్బంది విధులపై ఆరా తీశారు. - రాజమహేంద్రవరం సిటీ

తత్త్వణమామి
సదాశివలింగం



కాకినాడ జిల్లా పిఠాపురం పాదగయ పుష్కరిణిలో కార్తీక దీపం వెలిగించిన భక్తురాలు



కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం దుర్గాడలో ప్రత్యేక అలంకారంలో రామలింగేశ్వరస్వామి



ద్రాక్షారామంలో భీమేశ్వరస్వామికి పంచామృతాభిషేకం



తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం పుష్కర ఘాట్‌లో దీప ప్రజ్వలన చేస్తున్న మహిళ

కార్తీక మాసం రెండో సోమవారం శైవ క్షేత్రాలకు భక్తులు పోటెత్తారు. హరహర మహాదేవ, శంభోశంకర... పాహిమాం, రక్షమాం అంటూ శివనామ స్మరణ చేశారు. తెల్లవారుజామునే ఆలయాలకు వెళ్లి క్యూలైన్లలో బారులు తీరి శివుడిని దర్శించుకుని అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. రాజమహేంద్రవరం పుష్కరాల రేవులో అధిక సంఖ్యలో భక్తులు పుణ్యస్నానాలు ఆరించారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని ప్రముఖ క్షేత్రాలైన పిఠాపురం పాదగయలో కుక్కుటేశ్వరస్వామికి, సామర్లకోట, ద్రాక్షారామల్లో భీమేశ్వరస్వామికి, మురమళ్లలో వీరేశ్వరస్వామికి, కోటిపల్లిలో సోమేశ్వరస్వామికి అర్చకులు పంచామృతాభిషేకాలు, విశేష అర్చనలు జరిపారు.



కాకినాడ జిల్లా పిఠాపురం పాదగయ క్షేత్రంలో కుక్కుటేశ్వరస్వామికి అభిషేకం చేస్తున్న అర్చకులు



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు విక్రమభట్టేశ్వరస్వామి ఆలయంలో శివలింగానికి అభిషేకం



కాకినాడ జిల్లా సామర్లకోటలో కుమారరామ భీమేశ్వరస్వామికి క్షీరాభిషేకం



కాకినాడ జిల్లా గొల్లప్రోలులో బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన 25 అడుగుల శివలింగం



కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం రాచపల్లిలో అరుణాచలేశ్వరస్వామికి పంచహారతి ఇస్తున్న దృశ్యం

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★


కథే ఈ సినిమాకు హీరో



దేవన్


దేవన్ కథా నాయకుడిగా నటిస్తూ స్వీయ దర్శకత్వం వహించిన సినిమా 'కృష్ణ లీల'. 'తిరిగొచ్చిన కాలం' అనేది ఉపశీర్షిక. ధన్య బాలకృష్ణన్ హీరోయిన్. జ్యోత్స్న జి నిర్మిస్తున్నారు. ఈ నెల 7న సినిమా విడుదలవుతున్న సందర్భంగా దేవన్ మీడియాతో ముచ్చటించారు. 'ఇదో సూపర్ నేచురల్ లవ్‌స్టోరీ. కొత్తదనంతో నిండిన ఈ కథను నిర్మాతలకు వినిపించగానే ఓకే చేశారు. కృష్ణుడు ఒక ప్రేమ కథలో తన లీలలు ఎలా చూపిస్తారనేది ఆసక్తికరంగా చూపిస్తున్నాం. మనుషులు ఎలాగూ గడిచిపోయిన కాలాన్ని తిరిగి తీసుకురాలేరు. దైవత్వంతో ఆ కాలాన్ని తిరిగి తీసుకురావడమే చిత్ర కథాంశం. కృష్ణతత్వాన్ని అందరికీ మరింత బాగా అర్థమయ్యేలా ఇందులోని సన్నివేశాలు ఉంటాయి. కథే ఈ సినిమాకు హీరో. ప్రేమలోని గొప్పదనాన్ని అందంగా ఆవిష్కరిస్తుందీ చిత్రం. భీమ్స్ సిసిరోలియో సంగీతం సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లింది. చిత్రం అన్ని వర్గాల వారినీ మెప్పిస్తుందనే నమ్మకం ఉంది' అని చెప్పారు.

నటుడిగా యాభై ఏళ్లు.. 22న భారీ వేడుక!




విలక్షణ నటుడు డాక్టర్ మోహన్‌బాబు నటుడిగా పరిచయమై ఈ ఏడాదికి యాభై ఏళ్లు. ఆయన హీరోగా నటించిన తొలి చిత్రం 'స్వర్గం నరకం' 1975 నవంబరు 22న విడుదల అయింది. ఈ అసాధారణ ప్రయాణాన్ని గౌరవించుకునే క్రమంలో ఈ నెల 22న 'ఎంబీ 50.. ఏ పెర్ల్ నైట్ ట్రిబ్యూట్' అనే పేరుతో ఓ భారీ వేడుకను మంచు విష్ణు నిర్వహించనున్నారు. 'దిగ్గజ నటుడిని, భారతీయ సినిమాకు ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకొనేలా ఈ ఈవెంట్ ఉంటుందని మంచు విష్ణు చెప్పారు. ఎలాంటి సినిమా నేపథ్యం లేకపోయినా ఒంటరిగా సినీ ప్రయాణం మొదలు పెట్టి, తనకంటూ ఓ సామ్రాజ్యాన్ని ఏర్పరచుకుని విలక్షణ నటుడిగా ఎదిగిన మోహన్‌బాబు ఎదిగిన జర్నీ గురించి అందరికీ మరోసారి వివరించి చెప్పనున్నారు. ఈ వేడుక పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామని మంచు విష్ణు చెప్పారు.

ఉత్తమ నటుడిగా మమ్ముట్టి రికార్డ్!



సోమవారం ప్రకటించిన కేరళ ఫిల్మ్ అవార్డ్స్‌లో మలయాళ చిత్రరంగ సూపర్‌స్టార్ మమ్ముట్టి ఏడోసారి ఉత్తమ నటుడిగా ఎన్నికై అరుదైన రికార్డ్ నెలకొల్పారు. నటుడు ప్రకాశ్‌రాజ్ అధ్యక్షతన ఏర్పాటైన ఏడుగురు సభ్యులున్న జ్యూరీ కమిటీ అవార్డులను ఎంపిక చేసింది. త్రిస్సూర్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో కేరళ మంత్రి షాజీ చెరియన్ అవార్డుల వివరాలు వెల్లడించారు. 'భ్రమయుగం' చిత్రంలో నటించిన మమ్ముట్టి ఉత్తమ నటుడిగా ఎన్నికయ్యారు. ఉత్తమ చిత్రంగా 'మంజుమ్మల్ బాయిస్' ఎన్నికైంది. ఉత్తమ దర్శకుడు అవార్డ్ సహా మొత్తం ఎనిమిది అవార్డులతో ఈ సినిమా సత్తా చాటింది. ఉత్తమ నటుడిగా తను మరోసారి ఎన్నిక కావడంపై మమ్ముట్టి వ్యాఖ్యానిస్తూ 'ఇదో ప్రయాణం.. రకరకాల వ్యక్తులతో కలసి చేసే సుదీర్ఘ ప్రయాణం. ఇక్కడ పోటీ అనే పదానికి తావు లేదు' అని అన్నారు.

రాకెట్‌కు బాహుబలి పేరు - రాజమౌళి హర్షం



భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ(ఇస్రో) ఇటీవలే ఎల్‌వీఎం3-ఎం5 రాకెట్‌ను విజయవంతంగా ప్రయోగించిన విషయం తెలిసిందే. ఈ రాకెట్‌కు దాని బరువు, సామర్థ్యానికి తగ్గట్టుగా 'బాహుబలి' అనే పేరు పెట్టడంపై దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళి హర్షం వ్యక్తం చేశారు. 'దేశానికి గర్వకారణమైన క్షణం ఇది. మా సినిమా టైటిల్‌తో ఉన్న రాకెట్ ఇంత గొప్ప విజయాన్ని సాధించడం మాకు చాలా ఆనందాన్నిచ్చింది' అని ఇస్రో శాస్త్రవేత్తలను రాజమౌళి అభినందించారు.

సినిమా టిక్కెట్‌ల వివాదంపై సుప్రీం స్టే

మల్టిప్లెక్స్‌లలోని సినిమా టిక్కెట్‌లకు ఆడిట్ చేసే విధంగా రికార్డులను నిర్వహించాలని కర్ణాటక హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై సుప్రీంకోర్టు స్టే విధించింది. కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఏకరూప టిక్కెట్ విధానాన్ని (రూ.200 + జీఎస్టీ) ప్రశ్నిస్తూ హోంబలె ఫిల్మ్స్, మల్టిప్లెక్స్‌ల సంఘం హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. దీనిపై హైకోర్టు సింగిల్ జడ్జి మధ్యంతర స్టే ఇచ్చారు. ఈ ఉత్తర్వులకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌ను హైకోర్టు డివిజన్ బెంచ్ విచారించింది. సెప్టెంబరు 30న 'ఆడిట్ చేసే విధంగా రికార్డులను నిర్వహించాలి' అని ఆదేశాలు జారీ చేసింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు సోమవారం విచారించింది. జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన ద్విసభ్య ధర్మాసనం టిక్కెట్ ధరలపై అసంతృప్తిని వ్యక్తం చేసింది. మల్టిప్లెక్స్‌లలో వాటర్ బాటిల్‌కు రూ.100 వసూలు చేస్తున్నారని, ఇప్పటికే థియేటర్లకు వచ్చే వారి సంఖ్య తగ్గుతోందనీ, మరింత సహేతుకంగా ధరలను నిర్ణయించాలని, లేకపోతే హాళ్లు ఖాళీగా మారిపోతాయని ధర్మాసనం వ్యాఖ్యానించింది. బెంగళూరు (ఆంధ్రజ్యోతి)

మన జీవితాలకు వర్తించేలా ఉంటుంది



దీక్షిత్ శెట్టి

'దసరా', 'దియా' చిత్రాలతో తెలుగులో మంచి గుర్తింపు తెచ్చుకున్న దీక్షిత్ శెట్టి నటించిన తాజా చిత్రం 'ద గర్ల్‌ఫ్రెండ్'. రష్మిక కథానాయికగా రాహుల్ రవీంద్రన్ తెరకెక్కించారు. గీతా ఆర్ట్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్టైన్‌మెంట్స్ బేనర్లపై ధీరజ్ మొగిలినేని, విద్యా కొప్పినీడి నిర్మించారు. ఈ నెల 7న చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్ర విశేషాలను మీడియాతో ముచ్చటించారు దీక్షిత్ శెట్టి. 'దసరా' సినిమాలో నేను పోషించిన పాత్ర నచ్చి, 'ది గర్ల్‌ఫ్రెండ్'లో నటిస్తారా అని దర్శకుడు రాహుల్ రవీంద్రన్ అడిగారు. ఆయన చెప్పిన స్క్రిప్ట్ నచ్చి వెంటనే అంగీకరించాను. ఇందులో నా పాత్ర పేరు విక్రమ్. నా పాత్ర తీరుతెన్నులు ఎలా ఉంటాయి అనేది చాలా క్లియర్‌గా వివరించేవారు రాహుల్. నా పాత్రకు కొన్ని నెగెటివ్ షేడ్స్ ఉంటాయి. ఇప్పటిదాకా మనం చూసిన ప్రేమకథలన్నీ ఒక తరహాలోనే సాగుతుంటాయి. ప్రేమకథని మరో కోణంలో ఆవిష్కరించే చిత్రమిది. మనందరి జీవితాలకు వర్తించేలా సినిమా ఉంటుంది' అని తెలిపారు.

ప్రముఖ ఆలయాల్లో భక్తుల భద్రత, సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి

అన్నవరం, పిఠాపురం, సామర్లకోట ఆలయాల్లో ఏర్పాట్లపై నిరంతర పర్యవేక్షణ

అధికారులు సమన్వయంతో పనిచేయాలి : డిప్యూటీ సీఎం పవన్ ఆదేశం



పిఠాపురం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పవిత్రమైన కార్తీక మాసంలో ఆలయాలకు భక్తుల రద్దీ పెరిగిన నేపథ్యంలో ప్రముఖ ఆలయాల్లో భక్తుల భద్రత, సౌకర్యాలపై అధికార యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించాలని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆదేశించారు. క్యూలైన్ల ఏర్పాటు, పారిశుధ్య నిర్వహణ, భద్రతాపరమైన అంశాలపై శ్రద్ధ వహించాలన్నారు. కాకినాడ జిల్లాలోని ప్రముఖ శైవక్షేత్రాలైన పిఠాపురం పాదగయ, సామర్లకోట కుమారరామ భీమేశ్వరస్వామి, అన్నవరం సత్యనారాయణస్వామి ఆలయంతో పాటు ఇతర ముఖ్య ఆలయాల్లో ఏర్పాట్లపై ఆయన సోమవారం కలెక్టర్ సగిలి షాన్‌మోహన్, ఎస్పీ బిందుమాధవ్, జిల్లా అధికారులతో మాట్లాడి పలు అంశాలపై సూచనలు ఇచ్చారు. కాశీబుగ్గ సంఘటన నేపథ్యంలో ఆలయాల వద్ద అటువంటివి జరగకుండా అన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. దేవాదాయ శాఖ ఆధీనంలోని దేవాలయాలతో పాటు ప్రైవేటు ఆలయాల్లో ఉన్న పరిస్థితులపై అధికారులు తక్షణం పరిశీలన జరిపి కలెక్టర్, ఎస్పీలకు నివేదిక అందజేయాలని ఆదేశించారు. అన్నిచోట్లా భక్తుల రద్దీ ఏ విధంగా ఉంటుందో పర్యవేక్షణ చేయాలన్నారు. బుధవారం కార్తీక పౌర్ణమి, ఇతర ముఖ్యమైన పర్వదినాలతో పాటు శని, ఆది, సోమవారాల్లో భక్తుల రద్దీ ఊహించని విధంగా ఉంటుందని తెలిపారు. దేవాదాయ, పోలీసు, రెవెన్యూ, పంచాయతీరాజ్, మున్సిపల్ శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా క్యూలైన్ల ఏర్పాట్లు ఉండాలని, సీసీ కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షించాలన్నారు. తాత్కాలిక టాయిలెట్లు, మరుగుదొడ్ల ఏర్పాటుతో పాటు చెత్తచెదారం పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు తొలగించాలని, పారిశుధ్య నిర్వహణపై ఆయా మున్సిపాలిటీలు, పంచాయతీలు బాధ్యత తీసుకోవాలని సూచించారు. రద్దీ సమయాల్లో ఆర్టీసీ బస్సులను అధికంగా నడపాలని, ప్రమాదాలు జరగకుండా ట్రాఫిక్ నియంత్రణపై పోలీసు శాఖ దృష్టి సారించాలన్నారు. ఆలయాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. ప్రముఖ క్షేత్రాలతో పాటు అన్ని ఆలయాలకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలని పవన్‌కల్యాణ్ స్పష్టం చేశారు.

అన్నవరం...అప్రమత్తం!

- కాశీబుగ్గ ఘటన నేపథ్యంలో సత్యదేవుడి గిరిప్రదక్షిణపై ప్రభుత్వం దృష్టి
- రెండు లక్షలమంది వస్తారని అంచనా
- అన్నవరం దేవస్థానం అధికారులతో దేవదాయ కమిషనర్ వీడియో కాన్ఫరెన్స్
- గిరిప్రదక్షిణ జరిగే ప్రాంతమంతా పరిశీలించిన కాకినాడ జిల్లా ఎస్పీ



దేవదాయ కమిషనర్ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అన్నవరం దేవస్థానం అధికారులు

అన్నవరం నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి పర్వదినం పురస్కరించుకుని ఈనెల 5న సత్యదేవుడి గిరిప్రదక్షిణ నిర్వహణ, జాగ్రత్తలపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. ఇటీవల కాశీబుగ్గ ప్రమాద ఘటన నేపథ్యంలో అప్రమత్తతపై అన్నవరం దేవస్థానం అధికారులకు దేవదాయ శాఖ కమిషనర్ సోమవారం ఉదయం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సూచనలిచ్చారు. అలాగే డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆదేశాలతో కాకినాడ జిల్లా ఎస్పీ బిందుమాధవ్ గిరిప్రదక్షిణ జరిగే సుమారు 11 కిలోమీటర్ల దూరాన్ని, భక్తులకు కల్పించే ఏర్పాట్లను సోమవారం సాయంత్రం పరిశీలించారు. దేవదాయ కమిషనర్ వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ గిరిప్రదక్షిణకు సుమారు 2లక్షల మంది భక్తులు వస్తారని అంచనా ఉందని ఉదయం 8గంటలకు పల్లకీసేవ, మధ్యాహ్నం 2గంటలకు సత్యరథంతో గిరియాత్ర జరుగుతుందన్నారు. ఎక్కడా తోపులాటలకు ఆస్కారం లేకుండా రోప్‌పార్టీ ఉండాలని, 2 సమయాల్లో గిరిప్రదక్షిణ జరుగుతుందని విస్తృత ప్రచారం చేయాలని దేవదాయ కమిషనర్ రామచంద్రమోహన్ సూచించారు. భక్తులు ఎక్కడా వెయిటింగ్ లేకుండా నిరంతరాయంగా నడక కొనసాగేలా చేయాలని, ఒకేచోట భక్తజనం గుమికూడకుండా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు

ఇప్పటికే దేవదాయశాఖ ముగ్గురు ప్రత్యేక అధికారులకు బాధ్యతలు అప్పగించగా గిరిప్రదక్షిణ ఫెస్టివల్ అధికారిగా రీజనల్ జాయింట్ కమిషనర్ వి.త్రినాధరావును నియమించారు. గిరి ప్రదక్షిణ అనంతరం కార్తీకమాసం మిగిలిన పర్వదినాల్లో భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయలని సూచించారు. అనంతరం వీడియో కాన్ఫెరెన్సలో వెల్లడించిన అంశాలపై ఈవో సుబ్బారావు, చైర్మన్ రోహిత్ సిబ్బందితో సమావేశంలో వెల్లడించి కమిషనర్ ఆదేశాలకణుగుణంగా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ప్రధానంగా రూ.1500, 2000 వ్రతమండపాల వద్ద వెయిటింగ్ అధికంగా ఉంటుందని పరిస్థితులకు అనుగుణంగా వ్రతం టిక్కెట్ల విక్రయాలు చేపట్టాలని సూచించారు. కార్తీక పౌర్ణమి రోజున సుమారు 15వేల వ్రతాలు జరుగుతాయని అంచనా వేస్తూ ఏర్పాట్లు, సిబ్బంది ఉండాలని తెలిపారు.

పోలీస్‌లు అప్రమత్తంగా ఉండాలి

డిప్యూటీ సీఎం ఆదేశాలతో కాకినాడ జిల్లా ఎస్పీ బిందుమాధవ్ సోమవారం సాయంత్రం గిరిప్రదక్షిణ జరిగే సుమారు 11 కిలోమీటర్ల దారిని పరిశీలించారు. స్టాల్స్ ఏర్పాటు, మహిళలకు తాత్కాలిక మరుగుదొడ్ల తదితర వివరాలను దేవస్థానం అధికారులు వివరించగా ఆయన పలు సూచనలు చేశారు. పోలీస్ యంత్రాంగం అంతా చాలా అప్రమత్తంగా బాధ్యతతో వ్యవహరించాలన్నారు. నిర్లక్ష్యం ప్రదర్శించకుండా పర్యవేక్షణ జరగాలని డీఎస్పీ, సీఐలకు సూచించారు. కార్తీకమాసం పూర్తయ్యే వరకు భక్తులు అధికంగా వచ్చే పర్వదినాల్లో భద్రతాచర్యలు, గస్తీ ముమ్మరంగా ఉండాలని సూచించారు.



గిరి ప్రదక్షిణ రోడ్డును పరిశీలిస్తున్న కాకినాడ ఎస్పీ, దేవస్థానం అధికారులు

నేడు అంతర్వేదిలో మహాశాంతి హోమం

10వేల మంది భక్తులు వస్తారనే అంచనాతో ఏర్పాట్లు

అంతర్వేది/మలికిపురం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ నేపథ్యంలో రాజోలు నియోజకవర్గ ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా శ్రీలక్ష్మీనరసింహస్వామి అభయన్నిచ్చినందుకు నవనారసింహ క్షేత్రాల్లో ఒకటైన అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం ప్రాంగణం ఎదురుగా ఉన్న కల్యాణ షెడ్డులో మంగళవారం మహాశాంతి హోమాన్ని నిర్వహిస్తున్నట్టు ఆలయ సహాయ కమిషనర్ ఎంకేటీఎస్వీ ప్రసాద్ పేర్కొన్నారు. సుమారు పదివేలాది మంది భక్తులు ఈ హోమంలో పాల్గొంటారని, వారికి ప్రత్యేక అఖండ అన్నసమారాధన కూడా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు హోమం జరుగుతుందన్నారు. అలాగే మలికిపురం మండలం విశ్వేశ్వరాయపురంలో రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ విలేకర్లతో మాట్లాడుతూ భక్తుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా మొంథా పెను తుఫాన్ ప్రభావం నుంచి రాజోలు దీవి ప్రజలను, ఆస్తులను కాపాడిన నరసింహస్వామికి నిర్వహించే మహాశాంతి హోమాన్ని రాజోలు దీవి ప్రజలంతా కలసి విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు. 10వేల మంది భక్తులు వస్తారనే అంచనాతో ఏర్పాట్లు చేస్తున్నామని, పూర్ణాహుతి కార్యక్రమం కూడా ఉంటుందన్నారు. భక్తుల కోసం పలు ప్రాంతాల నుంచి బస్సులు ఏర్పాటు చేసినట్టు ఆయన చెప్పారు.

ఇంటి నుంచి వెళ్లిపోయిన బాలిక

తల్లిదండ్రులకు అప్పగింత

ప్రత్తిపాడు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): బాలిక మిస్సింగ్ కేసును 8గంటల్లో ప్రత్తిపాడు పోలీసులు చేధించారు. బాలికను తల్లిదండ్రులకు అప్పగించారు. వివరాలు ఇలా ఉన్నాయి. కాకినాడ జిల్లా ప్రత్తిపాడుకు చెందిన 14 ఏళ్ల బాలిక చదువు విషయంలో తల్లిదండ్రులు మందలించడంతో ఇంట్లోని సుమారు రూ.15లక్షల విలువైన బంగారం, రూ.50వేలు తీసుకుని ఆదివారం మధ్యాహ్నం వెళ్లిపోయింది. దీనిపై తల్లిదండ్రులు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్ఐ దర్యాప్తు చేపట్టారు. బాలిక ఆచూకీ కనుగొనేందుకు సీఐ బి.సూర్య అప్పారావు పర్యవేక్షణలో పలు బృందాలు గాలింపు చేపట్టాయి. సెల్‌ఫోన్ టెక్నాలజీ సహాయంతో ఎస్ఐ గాలింపు ముమ్మరం చేశారు. భీమవరం ప్రాంతంలో బాలిక ఉన్నట్లు గుర్తించారు. బాలికను బంగారం, నగదుతో సహా సురక్షితంగా తల్లిదండ్రులకు అప్పగించారు. దీంతో పోలీసుల్ని ఉన్నతాధికారులు అభినందించారు.

పుష్కరఘాట్‌లో గుర్తుతెలియని మృతదేహం

అంబాజీపేట, నవంబరు 3(ఆంధ్రజ్యోతి: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం వాకలగరువు పుష్కర ఘాట్‌లో సుమారు 35 ఏళ్ల గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. కాళ్లకు షూ ఉన్నట్టు స్థానికులు గుర్తించారు. కుడిచేతికి కనకదుర్గమ్మ బొమ్మతో ఎరుపు తాడు కట్టి ఉంది. ఎస్ఐ చిరంజీవి ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని బయటకు తీయించారు.

అండగా ఉంటాం అధైర్యపడొద్దు

బాధిత బాలిక కుటుంబానికి రూ.5లక్షలు ఎక్స్‌గ్రేషియా : మంత్రి సుభాష్

ఐ.పోలవరం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): అత్యాచారానికి గురైన బాలిక కుటుంబానికి రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియాతో పాటు బాలిక తల్లికి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం కల్పనకు మంత్రి వాసంశెట్టి సుభాష్‌హామీ ఇచ్చారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలంలో బాణాపురంలో బాలిక కుటుంబాన్ని మంత్రి సోమవారం పరామర్శించారు. బాలిక కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని, వైసీపీ మాయమాటలు నమ్మవద్దన్నారు. సంఘటన జరిగిన వెంటనే సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, హోంమంత్రి అనిత దృష్టికి తీసుకెళ్లామన్నారు. సీఎం వెంటనే బాధిత కుటుంబాన్ని పరామర్శించి అండగా ఉండాలని ఆదేశించారన్నారు. హోంమంత్రి అనిత వెంటనే ఎస్పీకి ఫోన్ చేసి నిందితుని అరెస్టు చేయాలని ఆదేశించినట్టు తెలిపారు. బాధిత కుటుంబానికి ఇళ్ల స్థలం కేటాయించి, ఇల్లు నిర్మించే ఏర్పాటు చేస్తామన్నారు. పిల్లల చదువు విషయంలో కూడా బాధ్యత తీసుకుంటామన్నారు. ఆ కుటుంబాన్ని ఎంపీ హరీష్‌మాధుర్, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్ పరామర్శించారు.

ఫోన్‌లో హోంమంత్రి పరామర్శ

బాణాపురంలో అత్యాచారానికి గురైన బాలిక కుటుంబాన్ని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత సోమవారం ఫోన్‌లో పరామర్శించారు. బాలిక తల్లితో మాట్లాడి మనోనిబ్బరంతో ఉండాలని సూచించారు. నిందితుడిని చట్టపరంగా కఠినంగా శిక్షించి న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు.

'నిందితులను విడిచిపెట్టం'



కంచిపల్లి శ్రీనివాస్ కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న మంత్రి సుభాష్, ఎంపీ హరీష్

అమలాపురం రూరల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మనిషి బతికుండగానే కిరాతకంగా నాలుక కోసి జుట్టు తొలగించడం అత్యంత హేయమైన చర్య అని వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం కొంకాపల్లిలోని మృతుడు కంచిపల్లి శ్రీనివాస్ భార్య దేవి, కుటుంబ సభ్యులను సోమవారం రాత్రి మంత్రి, ఎంపీ గంటి హరీష్ మాధుర్ పరామర్శించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ఫోన్ సంభాషణ ఆధారంగా మనిషిని బతికుండగానే అతి కిరాతకంగా హత్యచేసిన నిందితులను విడిచిపెట్టేదిలేదని హెచ్చరించారు. 60 రోజుల్లో బెయిల్ తీసుకుని బయటకు వద్దామనే పిచ్చిలో వాళ్లు ఉన్నారని, కానీ ఇకపై అటువంటి ఆటలు చెల్లవన్నారు. మర్డర్ ఫర్ గెయిన్ అని మరో బ్యాచ్ ఉందని, వాళ్లను కూడా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. హత్యచేసిన తరువాత బయటకు వచ్చి దండులు వేసి ఊరేగింపుగా తీసుకువస్తున్నారని అలా చేసిన వారిని విడిచిపెట్టేది లేదన్నారు. హత్య చేసిన నిందితులు కనీసం కూరగాయలు కోయడానికి కూడా భయపడేలా పోలీసులే చేస్తారని హెచ్చరించారు. హత్య చేసినవారు, వారికి సహకరించినవారు, అనుచరులను విడిచిపెట్టేది లేదని.. కోనసీమలో భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని ఎంపీ పేర్కొన్నారు. హత్యకు సంబంధించిన పోస్టుమార్టం నివేదిక అందాల్సి ఉందని పట్టణ సీఐ పి.వీరబాబు తెలిపారు.

సముద్రపు నాచుతో సంపద



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెషర్ మోహన్

సముద్రపు నాచు పెంపకానికి రాష్ట్రంలో మూడు జిల్లాలు ఎంపిక

అమృతానంద విశ్వవిద్యాలయ ప్రొఫెషర్ అమృతానటరాజన్

ఉప్పలగుప్తం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): సముద్రపు నాచు మానవాళికి ఆరోగ్యంతో పాటు సంపదను సమకూరుస్తుందని అమృతానంద విశ్వవిద్యాలయ ప్రొఫెషర్ అమృతానటరాజన్ అన్నారు. సముద్రపు నాచును ఆహారంగా తీసుకుంటున్న జపాను దేశస్థుల ఆయుష్షు పెరిగినట్టు నిరూపితమైందన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఉప్పలగుప్తం మండలం టి.చల్లపల్లి పంచాయతీ తీరగ్రామం వాసాలతిప్పలో సోమవారం రాష్ట్ర గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్)-డీఆర్‌డీఏ, మత్స్యశాఖ సంయుక్త ఆధ్వర్యంలో డ్వాక్రా సంఘాల మత్స్యకార మహిళలకు సముద్రపు నాచు పెంపకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నాచు పెంపకానికి రాష్ట్రంలో కోనసీమ, శ్రీకాకుళం, అనకాపల్లి జిల్లాలను ఎంపిక చేసినట్టు తెలిపారు. పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా సముద్రపు నాచు ఎలా పెంచాలన్న అంశంపై వివరణ ఇచ్చారు. మరో ప్రొఫెషర్ మోహన్ మాట్లాడుతూ విత్తిన తర్వాత కేవలం 45 రోజుల్లో ఏ ఎరువులు వాడక్కర్లేకుండా నాచు పెరుగుతుందన్నారు. ఇక కిలో విత్తనాలు నాటితే 5 కిలోల నాచు లభిస్తుందన్నారు. కిలో ధర రూ.20-25 మధ్య ఉంటుందన్నారు. ఔషధాలు, మినరల్స్, కాస్మోటిక్స్, పచ్చళ్ళు, చేపల మేతల తయారీలో సముద్రపు నాచును వినియోగిస్తారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఇసుకపట్ల జయమణీరఘుబాబు, ఆక్వా స్టేట్ డైరెక్టర్ దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ, టీడీపీ మండలాధ్యక్షుడు అరిగెల నానాజీ, తెలుగు యువత నియోజక వర్గ అధ్యక్షుడు గొలకోటి చిన్నా ఉన్నారు.

రెండు టన్నుల రేషన్ బియ్యం పట్టివేత

సీతానగరం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం ముగ్గుళ్ళ గ్రామం వద్ద వ్యాన్‌పై అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని ఎంఎస్‌వో నాగలక్ష్మి పట్టుకుని సీజ్ చేశారు. సోమవారం ముగ్గుళ్ళ నుంచి కోరుకొండ వెళ్తున్న వ్యాన్‌ను నాగలక్ష్మి తనిఖీ చేయగా 2 టన్నుల రేషన్ బియ్యం ఉండడం గమనించి స్వాధీనం చేసుకున్నారు. స్థానిక విలేకర్లతో ఆమె మాట్లాడుతూ కోరుకొండ మండలం కాపవరానికి చెందిన తలారి వీరబాబు, వారా రత్నరాజు ఇనుగంటివారిపేటలో ఇళ్ల వద్ద బియ్యం కొనుగోలు చేశామని కోరుకొండ తీసుకెళ్తున్నామని తెలిపారన్నారు. రేష్ బియ్యంతో పాటుగా వ్యాన్‌ను స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించి వారిపై ఫిర్యాదు చేశామన్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ రామ్‌కుమార్ తెలిపారు.

హత్య కేసులో వ్యక్తి అరెస్ట్

గండేపల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): యువకుడి హత్య కేసులో వ్యక్తిని అరెస్ట్ చేసినట్టు జగ్గంపేట సీఐ వైఆర్ కె.శ్రీనివాస్ తెలిపారు. కాకినాడ జిల్లా గండేపల్లి మండలం యర్రంపాలెంలో గత నెల 31న రాత్రి బుంగ బాబ్జీ, విజ్జన చందు కొత్తగా నిర్మాణం జరుగుతున్న ఇంటి వద్ద ఫోన్‌లో పబ్జీ గేమ్ ఆడుకుంటుండగా కాకర చిన్నీ అనే వ్యక్తి వచ్చి మీరు వెళ్లిపోండి అనడంతో గొడవ జరిగింది. చిన్ని క్షణికావేశంలో బాబ్జీని కత్తితో మెడపై నరకగా పెద్దాపురం ప్రభుతాసుపత్రికి తీసుకెళ్తుండగా మరణించాడు. సోమవారం నిందితుడు కాకర చిన్నిను పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు ఆధ్వర్యంలో జగ్గంపేట సీఐ, కిర్లంపూడి ఎస్ఐ జి.సతీష్ అరెస్టు చేసి కోర్టులో ప్రవేశపెట్టగా 14 రోజుల రిమాండ్ విధించినట్టు తెలిపారు.

'నన్నయ'లో అంతర్ కళాశాలల రెజ్లింగ్ పోటీలు, ఎంపికలు



రెజ్లింగ్ పోటీలను ప్రారంభిస్తున్న వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో రెజ్లింగ్ పురుష, మహిళల అంతర్‌కళాశాలల పోటీలు, విశ్వవిద్యాలయం జట్టు ఎంపికలు సోమవారం నిర్వహించారు. ఈ పోటీలను వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ ప్రారంభించారు. విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాలల నుంచి 51 మంది పురుష, మహిళ క్రీడాకారులు పాల్గొన్నారు. మహిళల ఫ్రీస్టైల్ విధానంలో 50 నుంచి 76 కిలోల కేటగిరి వరకూ జరిగాయి. వారిలో ఉత్తమ ప్రతిభ కనబరచిన క్రీడాకారులను విశ్వవిద్యాలయం జట్టుగా ఎంపికచేసి ఈ నెల 27 నుంచి 30 వరకూ రాజస్థాన్‌లో కోటా విశ్వవిద్యాలయంలో జరిగే సౌత్ జోన్ పోటీలకు పంపుతారు. అలాగే రెజ్లింగ్ పురుషుల ఫ్రీస్టైల్ విధానంలో 57 కిలోల నుంచి 125 కి లోల వరకూ క్రీడాకారులు పాల్గొని సత్తాచాటారు. రెజ్లింగ్ గ్రీకో రోమన్ విధానంలో 55 కిలోలనుంచి 130 కిలోల కేటగిరి వరకూ క్రీడాకారులు పాల్గొని సత్తాచాటారు. ఉత్తమ ప్రతిభ కనబరచిన వారిని విశ్వవిద్యాలయ జట్టుగా ఎంపిక చేసి పంజాబ్‌లోని చండీగఢ్ విశ్వవిద్యాలయంలో జరిగే సౌత్‌జోన్ పోటీలకు పంపుతారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కెవి.స్వామి, క్రీడాబోర్డు సహాయ కార్యదర్శి ఎంవివిఎస్.మూర్తి, కార్యనిర్వాహక చైర్మన్ డి.జ్యోతిర్మయి పరిశీలకులు నరసింహరాజు ఎంపిక కమిటీ సభ్యులు కె.కనకదుర్గ, ఏ.ధర్మేంద్ర తదితరులు పాల్గొన్నారు.

అంతర్‌జిల్లాల బాస్కెట్‌బాల్ పోటీలకు ఉమ్మడి జిల్లా జట్ల ఎంపిక



బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపికైన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జట్ల సభ్యులు

రామచంద్రపురం(ద్రాక్షారామ),నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్టణంలో ఈనెల 7 నుంచి 11వరకు జరుగనున్న ఏపీ అంతర్‌జిల్లాల బాస్కెట్‌బాల్ పోటీలకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బాలురు, బాలికల జట్లను ఎం పిక చేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం కృత్తివెంటి పేర్రాజు పం తులు క్రీడా ప్రాంగణంలో రామచంద్రపురం బాస్కెట్‌బాల్ అసోసియేషన్, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గత నెల 31 నుంచి ఈనెల 2వరకు గన్నమని భానుమతి మెమోరియల్ ఉమ్మడి జిల్లాల బాలురు, బాలికల బాస్కెట్ బాల్ పోటీలు జరిగాయి. బాలికల విభాగంలో రామచంద్రపురం ప్రథమస్థానం, పిఠాపురం ద్వితీయస్థానం, సీబీసీ రాజమండ్రి తృతీయస్థానం దక్కించుకున్నాయి. బాలుర విభాగంలో రామచంద్రపురం ప్రథమస్థానం, డీఎస్ఏ కాకినాడ ద్వితీయస్థానం, సీబీసీ రాజమండ్రి తృతీయస్థానం దక్కించుకున్నాయి. ఇందులో బాలురు, బాలికల జట్లు ఎంపిక చేశారు. జట్లను మంత్రి సుభాష్, ఏఎంసీ చైర్మన్ అక్కల రిష్వంత్‌రాయ్, ఎస్‌కెపిపి ట్రస్టు చైర్మన్ సలాదినాయుడుమాస్టారు, రాష్ట్ర బాస్కెట్ బాల్‌అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గన్నమని చక్రవర్తి, డా.చెలికాని రామారావు, డా.కోట వెంకటసతీష్‌కుమార్ అభినందించారు.

రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్‌గా సోళ్ల బొజ్జిరెడ్డి



సోళ్ల బొజ్జిరెడ్డి



గొర్లె సునీత

రంపచోడవరం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్‌గా రంపచోడవరం నియోజకవర్గానికి చెందిన గిరిజన ఉపాధ్యాయుడు, బీజేపీ సీనియర్ నాయకుడు సోళ్ల బొజ్జిరెడ్డిని ఆయనతో పాటు రంపచోడవరం నియోజకవర్గానికే చెందిన టీడీపీ మహిళా విభాగం రాష్ట్ర నాయకురాలు గొర్లె సునీతను సభ్యురాలిగా నియమిస్తూ ప్రభుత్వం జీవో.నెం.155 ద్వారా ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో అత్యంత కీలకమైన ఎస్టీ కమి షన్ చైర్మన్ పదవి రంప నియోజకవర్గానికి చెందిన బీపేపీ గిరిజన నాయకుడికి దక్కడం విశేషం. సోళ్ల బొజ్జిరెడ్డి ఉపాధ్యాయ వృత్తిలో ఉంటూనే గిరిజన హక్కులు, గిరిజన ఉపాధ్యాయ హక్కుల కోసం ఉద్యమాలు సాగించిన చరిత్ర ఉంది. ఉద్యోగాన్ని కూడా వదిలేసి పార్టీ కోసం గిరిజన గ్రామాల్లో తిరుగుతూ ఎంతో ఉనికిని తెచ్చారు. ఈ పరంపరలోనే ఆయనకు బీజేపీ 2019లో ఎమ్మెల్యే టికెట్‌ను కూడా ఇచ్చింది. ఇక చైర్మన్‌ను ఎంపిక చేసిన నియోజకవర్గం నుంచే సభ్యురాలిని కూడా ఎంపిక చేయడం తెలుగుదేశం పార్టీకి ఉన్న నిబద్ధతతకు నిదర్శనం.

సభ్యురాలిగా గొర్లె సునీత

గొర్లె సునీత మాజీ మంత్రి గొర్లె ప్రకాశరావు కుమార్తె. ఆమె స్వతహాగా ఏ పార్టీ మద్దతు లేకుండా నియోజకవర్గంలో తిరిగి, తర్వాత టీడీపీ సభ్యత్వం తీసుకుని పార్టీని బలోపేతం చేయడంలో తన వంతు కృషి చేశారు. 2019 నుంచి, 2024 ఎన్నికల వరకూ రంపచోడవరం టీడీపీ ఎమ్మెల్యే టికెట్ కోసం ప్రయత్నించారు. టికెట్ దక్కక పోయినా నిరాశ చెందకుండా పార్టీ కోసం నియోజకవర్గంలో సంచరిస్తూ కార్యకర్తలు, మండల నాయకుల సమస్యలపై స్పందించి తన వంతుగా కృషి చేస్తూ అందించిన సేవలను గుర్తించింది. దీంతో తొలుత జీసీసీ డైరెక్టర్ పదవిని ఇచ్చారు. అనంతర జరిగిన కసరత్తులో ఆమెను ఎస్టీ కమిషన్ సభ్యురాలిగా ఎంపిక చేశారు.

ఇన్నోవేషన్ కాన్‌క్లేవ్‌కు 'నన్నయ' అధ్యాపకురాలు



ఇన్నోవేషన్ కాన్‌క్లేవ్‌కు హాజరైన సుష్మప్రియ

దివాన్‌చెరువు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): న్యూఢిల్లీలోని భారత్ మండపంలో జరుగుతున్న ఎమర్జింగ్ సైన్స్ టెక్నాలజీస్, ఇన్నోవేషన్ కాన్‌క్లేవ్ (ఈఎస్‌టీఐసీ-2025)కు తూర్పుగోదావరి జిల్లా ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఫిజిక్స్ అధ్యాపకురాలు వై.సుష్మప్రియ హాజరయ్యారు. శాస్త్ర,సాంకేతిక శాఖ ఆధ్వర్యంలో సీఎస్ఐఆర్, డీఏఐ, ఐసీఎంఆర్, డీఆర్‌డీవో విద్యామంత్రిత్వశాఖ అంతరిక్ష విభాగాల సహకారంతో సోమవారం నుంచి ప్రారంభమైన ఈ కార్యక్రమం ఈనెల 5 వరకూ జరుగుతుంది. ప్రధాని మోదీ విచ్చేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. సుష్మప్రియ యువశాస్త్ర సాంకేతిక నాయకుల విభాగంలో క్వాంటం సైన్స్ అండ్ టెక్నాలజీ, అడ్వాన్స్ మెటీరియల్స్ అండ్ మ్యానుఫాక్చరింగ్ అంశాల్లో ఎంపికవ్వగా ఆమెను వీసీఆచార్య ప్రసన్నశ్రీ అభినందించారు.

భీమవరం పీఎఫ్ ఆఫీస్‌కి అఖిత భారత స్థాయి అవార్డు

ప్రాంతీయ కమిషనర్ వెంకటేశ్వర్లు



అవార్డు స్వీకరిస్తున్న ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్ వెంకటేశ్వర్లు

రాజమహేంద్రవరం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్‌వో) 73వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ప్రకటించిన పురస్కారాల్లో అఖిల భారత స్థాయిలో భీమవరం జిల్లా కార్యాలయానికి అవార్డు దక్కిందని ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్-2 వెంకటేశ్వర్లు కలువాయి తెలిపారు. ఈ అవార్డును భీమవరం జిల్లా కార్యాలయ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి డి.ఏలీషారావుతో కలిసి న్యూఢిల్లీలో ఈ నెల 1న జరిగిన వ్యవస్థాపక దినోత్సవ కార్యక్రమంలో కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి నుంచి అందుకోవడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఉద్యోగులను ఆయన అభినందించారు. 2022-23లో రాజమహేంద్రవరం ప్రాంతీయ కార్యాలయం ఉత్తమ పనితీరు కనబరిచిన కార్యాలయంగా ఎంపికైందని గుర్తుచేశారు. 2023-24 ఏడాదికి స్వచ్ఛత అవార్డుల్లో అఖిల భారత స్థాయిలో మొదటి స్థానంలో నిలిచామన్నారు. సిబ్బంది నిబద్ధత, మెరుగైన సేవలకు గుర్తింపు దక్కడం గర్వకారణమని వెంకటేశ్వర్లు పేర్కొన్నారు.

'పదోన్నతులకు వృత్తి నైపుణ్య శిక్షణలు అవసరం'

సామర్లకోట, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): పంచాయతీ రాజ్ శాఖలో పదోన్నతులు త్వరతతగతిన వస్తున్నాయని ఆయా పోస్టుల్లో మరింత వృత్తినైపుణ్యం పెంపొందించుకునేందుకు నిష్ణాతులైన ఫ్యాకల్టీలతో శిక్షణ తరగతులు ఎంతో అవసరం అని కాకినాడ జిల్లా సామర్లకోట విస్తరణ శిక్షణా కేంద్ర ప్రిన్సిపాల్ కెఎన్వీ. ప్రసాదరావు పేర్కొన్నారు. కేంద్రం ఆవరణలో ఇటీవల డిప్యూటీ ఎంపీడీవోలుగా పదోన్నతులు పొందిన అధికారులకు 2 రోజుల శిక్షణ తరగతులు, జూనియర్ అసిస్టెంట్లకు 6 రోజుల శిక్షణ తరగతులను సోమవారం ప్రిన్సిపాల్ జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. పదోన్నతులు త్వరగా వస్తున్నందున ఎవరు ఎప్పుడు ఏ పాత్ర చేయాలన్నా సిద్ధంగా ఉండాలని ఇందుకు శిక్షణలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ జీ.రమణ, డీడీవో డి.శ్రీనివాసరావు, ఎంపీడీవో శర్మ, సుశీల తదితరులు ఉన్నారు.

క్రొవ్విడి లింగరాజు జయంతి


రఘుదేవపురంలో లింగరాజు స్మారక పురస్కారం అందజేస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం కల్చరల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు, పాత్రికేయుడు, ప్రజాప్రతినిధి క్రొవ్విడి లింగరాజు జయంతిని సోమవారం నిర్వహించారు. స్థానిక ఆర్యాపురం ఏపీ నాగేశ్వరరావు పార్కులో ని ఆయన విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ మాట్లాడుతూ గాంధీ, నెహ్రూల తర్వాత తెలుగు రాష్ట్రాల్లోని స్వాతంత్ర్య సమరయోధుల్లో తన దైన ముద్ర వేసుకున్న మనిషి లింగరాజుకే దక్కుతుందన్నారు. అశోక్ కుమార్ జైన్ మాట్లాడుతూ మునిసిపల్ చైర్మన్‌గా, ఎమ్మెల్యేగా ప్రజలకు సేవలందించారన్నారు.ఈ సందర్భంగా పాత్రికేయుడు రామవరపుకు క్రొవ్విడి లింగరాజు స్మారక పురస్కారాన్ని అందజేశారు. ఆంధ్ర కేసరి యువజన సమితి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో లింగరాజు మనుమలు సుబ్రహ్మణ్యం, భాస్కరరావు, సమితి పూర్వాధ్యక్షుడు మాదిరాజు శ్రీనివాస్, దేశిరెడ్డి బలరామనాయుడు, దూర్వాసుల సత్యనారాయణ, ఏవీ కృష్ణశర్మ పాల్గొన్నారు.

17 నుంచి ఏఐసీటీఈ అటల్ ఆన్‌లైన్ ఎఫ్‌డీపీ

జీజీయూ ఛాన్సలర్ సత్యనారాయణరాజు

రాజానగరం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): గోదావరి గ్లోబల్ యూనివర్శిటీ(జీజీయూ)లోని మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో క్లీన్ మొబిలిటీ రెవల్యూషన్-ఎలక్ట్రిక్ అండ్ హైడ్రోజన్ పవర్డ్ వెహికల్స్ అనే అంశంపై ఏఐసీటీఈ-అటల్ ఆన్‌లైన్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం(ఎఫ్‌డీపీ) ఈ నెల 17 నుంచి నిర్వహిస్తున్నట్టు ఛాన్సలర్ కేవీవీ సత్యనారాయణ రాజు(చైతన్యరాజు)తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను జీజీయూలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఛాన్సలర్ మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో కొరియా రాజశేఖర్(అమెరికా),అమర్నాథ్ వర్మ(దక్షిణ కొరియా), ఏ.శ్రీకాంత్(యూకే), ఎంవీ రెడ్డి (కెనడా) ముఖ్య ప్రసంగీకులుగా పాల్గొంటారన్నారు. కేంద్ర పరిశోధనా సంస్థలు, ఐఐటీలు, ఎన్ఐటీలు, ప్రముఖ పారిశ్రామిక సంస్థల నిపుణులు కూడా రీసోర్స్‌పర్సన్లుగా పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో జీజీయూ ఉపకులపతి వై.చంద్రశేఖర్, ప్రో వైస్ ఛాన్సలర్ కేవీబీ రాజు, రిజిస్ట్రార్ పీఎం ఎంఎస్ శర్మ, డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావు, ఎఫ్‌డీపీ కోఆర్డినేటర్ టీ.జయానందకుమార్, కన్వీనర్ వి.సుబ్రహ్మణ్యం, కోఆర్డినేటర్ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీపై కక్షతోనే ఫేక్ ఆడియోలు, వీడియోలు

మాజీ కార్పొరేటర్ కిలపర్తి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): టీడీపీ నాయకులపై కక్షతో ఫేక్ ఆడియోలు, వీడియోలను సోషల్ మీడియాలో పోస్టు చేస్తున్నారని మాజీ కార్పొరేటర్, టీడీపీ నాయకుడు కిలపర్తి శ్రీనివాస్ ఆరోపించారు. ఈ మేరకు సోమవారం ఆయన రాజమహేంద్రవరంలో ఒక ప్రకటన విడుదల చేశారు. తన వాయిస్‌తో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న ఆడియోకు తనకు ఎటువంటి సంబంధం లేదన్నారు.నగరంలో మద్యంషాపులకు, వాటి యజమానులతో తనకు ఎటువంటి సంబంధంలేదని, తనకు షాపులు లేవని చెప్పారు. మద్యం వ్యాపారంతో మాట్లాడినట్టు సోషల్ మీడియాలో వాయిస్‌ను పెట్టారని, గతంలో కూడా ఒకరినొకరు తిట్టుకున్నట్టు ఒక ఫేక్ ఆడియోను సృష్టించారని, రాజకీయంగా ఖాళీగా ఉన్న వారికి ఇలాంటివి అలవాటేనన్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశానని శ్రీనివాస్ పేర్కొన్నారు.

బ్యాంబు సాతుల్లాతో నీటి సంఘాలకు ఆదాయం

కెనాల్ బండ్ ప్లాంటేషన్‌పై డీఎఫ్‌వోతో చర్చించిన తూర్పుడెల్టా చైర్మన్


డీఎఫ్‌వో శ్రీనివాస్‌తో చర్చిస్తున్న తూర్పుడెల్టా ప్రాజెక్ట్ చైర్మన్ సునీల్‌కుమార్, వైస్ చైర్మన్ సుధాకర్‌రెడ్డి

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): గ్రేట్ గ్రీన్ వాల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ప్రాజెక్టులో భాగంగా సోమవారం కెనాల్ బండ్ ప్లాంటింగ్‌పై రాజమహేంద్రవరంలోని ఏపీ స్టేట్ ఫారెస్ట్ అకాడమీలో డీఎఫ్‌వో శ్రీనివాస్‌తో గోదావరి తూర్పుడెల్టా ప్రాజెక్టు చైర్మన్ మురాలశెట్టి సునీల్ కుమార్, వైస్ చైర్మన్ తమలంపూడి సుధాకర్ రెడ్డి చర్చించారు. సోమవారం ఫారెస్ట్ అకాడమీకి వచ్చిన వారిద్దరూ డీఎఫ్‌వో శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆంధ్రప్రదేశ్ గ్రేట్ గ్రీన్ వాల్ ఆఫ్ ఏపీ ప్రాజెక్టులో భాగంగా మొట్టమొదటిసారిగా వినియోగంలోకి తీసుకొస్తున్న బ్యాంబు సాతుల్లా అనే అరుదైన వెదురుజాతిని కెనాల్స్‌పై పెంచాలని, నాటిన నాటి నుంచి ఏడాది నుంచి 40 సంవత్సరాల వరకు ఆదాయం ఇస్తుందనే అంశంపై చర్చించారు. నీటి సంఘాలకు ప్రతి ఏడాది ఆదాయం లభిస్తుందని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో కోటిపల్లి డీసీ విజయగోపాలరాజు, కాజులూరు డీసీ లాకాని కృష్ణచైతన్య, సిరిపురం డీసీ పేపకాయల నాయకులు, ఏలేశ్వరం డీసీ సుబ్రహ్మణ్యేశ్వర చౌదరి, అటవీ శాఖ అధికారులు పాల్గొన్నారు.

పెందుర్తి అబిరామ్ పరామర్శ

సీతానగరం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ఉపాధి నిమిత్తం హైదరాబాద్ వెళ్లి ప్రమాదవశాత్తు రైలు నుంచి జారిపడి మృతిచెందిన సీతానగరం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త పొట్ఫూరి అరుణ్‌కుమార్ కుటుంబ సభ్యులను ఆదివారం పార్టీ నాయకుడు పెందుర్తి అబిరామ్ పరామర్శించారు.బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు. అనంతరం ఇటీవల మృతిచెందిన పలువురి కుటుంబాలను ఆయన పరామర్శించారు.

మత్స్యకారులకు అండగా ఉంటాం

- ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు
- తుఫాన్ బాధిత కుటుంబాలకు నిత్యావసరాల పంపిణీ


మత్స్యకారులకు నిత్యావసరాలను అందజేస్తున్న ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మత్స్యకార కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా వుంటామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అన్నారు. మొంథా తుఫాన్ బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న 50 కిలోల బియ్యం, కిలో కందిపప్పు, బంగాళా దుంపలు, కిలో పంచదార, లీటరు నూనె, ఉల్లిపాయలను స్థానిక కోటిలింగాలపేటలో 145 మత్స్యకార కుటుంబాలకు ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తుఫాన్ వల్ల వేట నిషేధం సమయంలో ఇంటికి పరిమితమైన మత్స్యకార కుటుంబాలను ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం ముందుకొచ్చిందన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరం రూరల్ వార్డు పరిధిలోని ఆల్కాట్ గార్డెన్, మండలంలోని రాజవోలు గ్రామంలో పునరావాస కేంద్రాల్లో ఉన్న కుటుంబాలకు ఆర్థిక సహాయంతోపాటు మత్స్యకార కుటుంబాలకు 50 కిలోల బియ్యం, ఇతర కుటుంబాలకు 25 కిలోల బియ్యంతో పాటు 6 రకాల నిత్యావసర వస్తువులను ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని, మండలంలోని సుమారు 525 ఎకరాల్లో పంట నష్టం నమోదైనట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఆల్కాట్ తోట కమ్యూనిటీ హాల్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 28 కుటుంబాలకు రూ.48 వేలు, రాజవోలులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 89 కుటుంబాలకు రూ.1,55,000 అందజేశారు.కార్యక్రమంలో తహసీల్దార్లు శ్రీనివాసరావు, పాపారావు, పంచాయతీ కార్యదర్శి కాశీవిశ్వనాథ్, ఆర్ఐ ప్రసాద్, నమ్మలపూడి రామకృష్ణ, గాలి వెంకటేశ్వరరావు, వడ్డీ వరప్రసాద్, శీలం గోవింద్, రొంపిచర్ల ఆంటోనీ, కొప్పిశెట్టి చిన్ని, కుంచె నాగేంద్రరావు పాల్గొన్నారు.

అనపర్తి: తుఫాన్ నేపథ్యంలో అనపర్తి, బిక్కవోలు మండలాల్లోని పునరావాస కేంద్రాల్లో తలదాచుకున్న బాధితులకు సోమవారం అనపర్తి తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అనపర్తి, బిక్కవోలు మండలాలలో పునరావాస కేంద్రాల్లో తలదాచుకున్న 489 మందికి ప్రభుత్వం మంజూరు చేసిన రూ.4.19లక్షల ఆర్థిక సహాయాన్ని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మొంథా తుఫాన్ ప్రభావంపై పది రోజుల ముందుగా అన్ని శాఖల అధికారులను అప్రమత్తం చేస్తూ ఎప్పటికప్పుడు పర్యవేక్షించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ముందు చూపుతో ప్రాణ, ఆస్తి నష్టం తగ్గించగలిగామన్నారు. అలాగే ప్రతి రైతును ఆదుకునే విధంగా ప్రభుత్వం కృతనిశ్చయంతో పని చేస్తోందన్నారు. తుఫాన్ సమయంలో ప్రభుత్వ యంత్రాంగం చూపిన చొరవను ప్రతి ఒక్కరూ ప్రశంసిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ జుత్తుక సూర్యకుమారి, ఆత్మ చైర్మన్ వెలుగుబంటి సత్తిబాబు, కర్రి శేషారత్నం, తహసీల్దార్ అనిల్ కుమార్, ఎంపీడీవో రామకృష్ణారెడ్డి, సర్పంచ్‌లు గొల్లు హేమతులసి, గిరిడా గంగాభవాని, కూటమి నాయకులు పాల్గొన్నారు.


రాజవోలులో నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గోరంట్ల


అనపర్తిలో ఆర్థిక సాయం అందిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

బాలదుర్గమ్మకు ప్రత్యేక పూజలు

దేవరపల్లి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): దేవరపల్లిలో బాలదుర్గమ్మ ఆలయంలో కార్తీక సోమవారం కావడంతో ఉదయం నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు కుంకుమ పూజలు, కార్తీక దీపాలు వెలిగించారు. త్యాజంపూడికి చెందిన గంటా వెంకటలక్ష్మికి బెల్లంతో తులాభారం వేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పనితీరుపై నమ్మకాన్ని పెంచాలి

కార్పొరేషన్ పీజీఆర్ఎస్‌లో కమిషనర్ రాహుల్‌మీనా


ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ రాహుల్‌మీనా

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ పనితీరు పట్ల అర్జీదారుల్లో నమ్మకాన్ని పెంపొందించాలని రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కమిషనర్ రాహుల్‌మీనా ఆదేశించారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో ప్రజల నుంచి ఆయన అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్జీదారుల సమస్యలను పారదర్శకంగా జవాబుదారీతనంతో సంతృప్తి చెందేలా పరిష్కరించాలన్నారు. పీజీఆర్ఎస్‌లో మొత్తం 46 అర్జీలు వచ్చాయని వాటిలో ఇంజనీరింగ్ విభాగానికి 15, రెవెన్యూకి 6, టౌన్ ప్లానింగ్ 13, పబ్లిక్ హెల్త్‌కి 4, వార్డు సచివాలయాలకు 8 వచ్చాయన్నారు.వాటిని పరిశీలించి సత్వర పరిష్కారం చూపించాలని ఆదేశించారు.

ఓపెన్ ఎయిర్ థియేటర్ పరిశీలన

రాజమహేంద్రవరం సుబ్రహ్మణ్య మైదానంలో ఉన్న ఓపెన్ ఎయిర్ థియేటర్‌ను కమిషనర్ రాహుల్‌మీనా పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రకృతి ఒడిలో సినిమాను ఆస్వాదించాలనుకునే వారికి ఈ థియేటర్ బాగుంటుందన్నారు. స్క్రీన్, స్పీకర్ల కండిషన్‌పై ఆరా తీశారు. మరమ్మతులు ఏమైనా వుంటే చేయించాలని అధికారులకు ఆదేశించారు. థియేటర్ ప్రాంగణంలో ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఇదిలా ఉండగా స్థానిక క్వారీ సెంటర్ సమీపంలోని ఏబీసీ సెంటర్‌ను కమిషనర్ తనిఖీ చేశారు. అక్కడి సదుపాయాలు, ఆపరేషన్ థియేటర్, షెడ్లు, ఇతర సౌకర్యాలను పరిశీలించారు. వైద్యులతో మాట్లాడి వ్యాక్సినేషన్, యానిమల్ బర్త్ కంట్రోల్ (ఏబీసీ) ఆపరేషన్లు శస్త్రచికిత్సలు అనంతరం పర్యవేక్షణపై ఆరా తీశారు. ఏబీసీ ప్రక్రియ పక్కాగా జరగాలని ఆదేశించారు. ఆయా కార్యక్రమాల్లో అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్,డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకటరమణ, సెక్రటరీ జె.శైలజావల్లి, ఎస్ఈ ఇన్‌ఛార్జి రీటా,ఎంహెచ్‌వో డాక్టర్ వినూత్న, డిప్యూటీ సిటీ ప్లానర్ నాయుడు, మేనేజర్ ఎండీ అబ్దుల్‌మాలిక్, రెవెన్యూ అధికారి నేహాల్ శ్రీనివాసరావు, ఈఈ మదర్షాలీ తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన యాత్రలు

సృజనాత్మకతను పెంపొందించేందుకే

అనపర్తి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించేందుకు విజ్ఞాన, వినోద యాత్రలు దోహదపడతాయని అనపర్తిలోని జడ్పీ బాలికోన్నత పాఠశాల హెచ్ఎం కర్రి కళ్యాణి అన్నారు. సోమవారం పాఠశాల విద్యార్థినులు విజ్ఞాన వినోద యాత్రకు వెళ్లారు. ఈ సందర్భంగా ధవళేశ్వరం కాటన్ మ్యూజియం, ఇస్కాన్ టెంపుల్, ఏపీ టూరిజం బోట్ షికారు, పలు నర్సరీలను విద్యార్థినులు సందర్శించారు. హెచ్ఎం మాట్లాడుతూ ఈ యాత్ర ఆద్యంతం వినోదభరితంగా సాగిందని, విద్యార్థినులు అనేక విషయాలపై అవగాహన పొందారని అన్నారు.

నన్నయలో నూతన భవనానికి శంకుస్థాపన


వర్సిటీ ప్రాంగణంలో నూతన భవనానికి భూమిపూజ చేస్తున్న వీసీ ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ పీఎం ఉష(రూసా) పథకం కింద ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ప్రాంగణంలో నిర్మించనున్న నూతన భవనానికి వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ సోమవారం భూమిపూజ చేశారు. రూ.9.35 కోట్ల వ్యయంతో సెంటర్ ఫర్ అడ్వాన్స్‌డ్ రీసెర్చ్ అండ్ లెర్నింగ్ భవనం(ఇక్సన్ టు) నిర్మిస్తున్నట్టు ఆమె చెప్పారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి, రసాయన భవనాల శాఖ ఎస్ఈ కాంత, డీఈఈ మధు, ఏఈ కిరణ్, వర్సిటీ ఇంజనీర్లు, అధికారులు పాల్గొన్నారు.

స్కూల్‌కు బీరువాల అందజేత

రాజమహేంద్రవరం కల్చరల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలోని గౌతమి హాట్ రాజమండ్రి వద్దకు స్వచ్ఛంద సేవా సంస్థ ఉచిత సేవ కార్యక్రమాల్లో భాగంగా సోమవారం, పెద పోస్టాఫీసు వద్ద గల ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి.సరస్వతికి బీరువాలు అందజేశారు. కార్యక్రమంలో తవ్వా రాజా, బాలాజీ జలీష్ గుప్తా, వై.వెంకటేశ్వరరావు, దేవత సుధాకర్, ఎల్.వీరభద్రరావు, సీతారామాంజనేయులు,మాణిక్యాలు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలి

ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు గిరిప్రసాద్‌వర్మ


నూతన కమిటీ సభ్యులకు బాధ్యతలు అప్పగిస్తున్న గిరిప్రసాద్‌వర్మ

రంగంపేట, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): సచివాలయ ఉద్యోగులకు వారి సేవా ఆధారంగా ఆయా ప్రభుత్వ శాఖల్లో పదోన్నతులు కల్పించాలని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు పి.గిరిప్రసాద్‌వర్మ డిమాండ్ చేశారు. సోమవారం మధ్యాహ్నం రంగంపేటలో ఏపీ గ్రామ-వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో జిల్లా చైర్మన్ వి.రామదాసు అధ్యక్షతన జరిగిన మండల కమిటీ ఎన్నికకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. సచివాలయ ఉద్యోగులు గ్రామస్థాయి నుంచి ప్రజలకు విశేష సేవలందిస్తున్నారని, వారి సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. సీఎం చంద్రబాబు తుఫాన్ సమయంలో సచివాలయ ఉద్యోగుల సేవలను ప్రశంసించడం సంతోషకరమన్నారు. ఈ సందర్భంగా సచివాలయ ఉద్యోగుల సంఘం మండల నూతన కమిటీ ఎన్నిక నిర్వహించారు. అధ్యక్షుడిగా ఎ.డిసిలీ, ఉపాధ్యక్షులుగా వీర్రాజు, వంశీ, ఉపాధ్యక్షురాలిగా చంద్రలత,ముఖ్యకార్యదర్శిగా పూర్ణచంద్ర, జాయింట్ సెక్రటరీలుగా రత్నబాబు, కృష్ణసుధీర్, మహిళా కార్యదర్శి రమాదేవి, మరో ఐదుగురిని ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికకు పరిశీలకుడిగా పి.గిరిప్రసాద్‌వర్మ వ్యవహరించారు.వి.రామదాసు మాట్లాడుతూ జిల్లాలోని 19 మండలాల్లో కమిటీల ఎంపికలు జరుగుతున్నాయన్నారు. ఈ నెల 30న జీవో 11కు వ్యతిరేకంగా జిల్లా సదస్సు రాజమహేంద్రవరంలో నిర్వహించనున్నామని, అధిక సంఖ్యలో ఉద్యోగులు పాల్గొనాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు మద్దా ప్రకాష్, బత్తిన మహేష్ తదితరులు పాల్గొన్నారు.

భక్తులతో పోటెత్తిన శివాలయాలు

- కార్తీకమాసం పూజలు
- స్వామివారికి అభిషేకాలు
- అమ్మవారికి కుంకుమార్చన


బిక్కవోలులో అలంకార రూపంలో గోలింగేశ్వరుడు

దివాన్‌చెరువు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం రెండో సోమవారం వివిధ గ్రామాల్లోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. దివాన్‌చెరువు, పాతతుంగపాడు, నవభారతనగర్ తదితర గ్రామాల్లో భక్తులు వేకువజాము నుంచే ఆలయాలకు చేరుకుని దీపాలు వెలిగించారు. కొంతమంది 365 ఒత్తులు వెలిగించడంతో బాటు దీపదానం చేశారు. అలాగే స్వామివారికి అభిషేకాలతో బాటు అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు. భక్తుల పంచాక్షరీనామంతో ఆలయాలు మార్మోగాయి.

బిక్కవోలు: మండలంలోని శివాలయాల్లో భక్తులతో పోటెత్తాయి. బిక్కవోలులోని ప్రాచీన గోలింగేశ్వరస్వామి ఆలయానికి తెల్లవారుజాము నుంచి భక్తులు స్వామి దర్శనానికి బారులు తీరారు. ఈ సందర్భంగా స్వామి పంచామృతాలతో అభిషేకాలు జరిపి లక్ష బిల్వార్చన జరిపారు. అలాగే పార్వతీదేవికి లక్ష కుంకుమార్చన జరిపారు. స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. కొంకుదురులోని బుడతల మామిడి వద్ద ఉన్న త్రిముఖలింగేశ్వరస్వామి, ఊలపల్లిలోని అగస్త్యేశ్వరస్వామి, ఇల్లపల్లిలోని 108 స్తంభాల గుడిలోని పాదరసలింగాన్ని, బలభద్రపురంలోని ద్వాదశ జ్యోతిర్లింగాలను అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

ఓం శివశక్తి పీఠంలో రుద్రాభిషేకం

కోరుకొండ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): రాజానగరం నియోజకవర్గ ప్రజల అభివృద్ధిని ఆకాంక్షిస్తూ ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఆధ్వర్యంలో మండలంలోని గాదరాడలో ఓం శివశక్తి పీఠంలో రుద్రాభిషేకం, గణపతి హోమం, రుద్రహోమం నిర్వహించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

రంగంపేటలో లక్ష్మీగణపతి హోమం

రంగంపేట, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): రంగంపేటలో శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయం ఎదురుగా శ్రీమణికంఠ క్షేత్రంలో చొల్లంగి అర్చనరావు గురుస్వామి ఆధ్వర్యంలో సోమవారం శ్రీలక్ష్మీగణపతి హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా పండితులు.. కేత సత్తిబాబుస్వామి దంపతులతో హోమం, పూజలు చేయించారు. అంతకు ముందు సుమారు 300 మంది కన్నులు మంగళవాయిద్యాల నడుమ కలశాలతో ఊరేగింపుగా వెళ్లి ఉమారామలింగేశ్వరస్వామికి, స్థానిక మణికంఠ క్షేత్రం వద్ద లింగేశ్వర స్వామికి జలాభిషేకం చేశారు.మధ్యాహ్నం భక్తులకు మహా అన్నదానం చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


గాదరాడలో హోమం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బత్తుల


రంగంపేటలో లింగేశ్వరుడికి జలాభిషేకం చేస్తున్న భక్తులు

తాగునీటికి ఇక్కట్లు

దివాన్‌చెరువు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): తాగునీటికోసం తాము అనేక ఇక్కట్లు ఎదుర్కొంటున్నామని దివాన్‌చెరువు పంచాయతీ పరిధిలోని సాయిదుర్గానగర్ నివాసితులు పలువురు వాపోయారు. పంచాయతీ ద్వారా సరఫరా చేసే తాగునీరు మూడురోజులుగా సరఫరా కాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. దాదాపు యాభై కుటుంబాలు వారు నివసిస్తున్న ఈప్రాంతానికి తాగునీటిని సరఫరా చేసేందుకు పంచాయతీ బోరు ఉంది. అయితే దాని మోటారు వైండింగ్ కాలిపోవడంతో బాటు పంపు మరమ్మతులకు గురికావడం తో ఈ సమస్య ఏర్పడినట్టు తెలియవచ్చింది. ఇరుగుపొరుగు వారి సహకారంతో తమ నీటి అవసరాలు తీర్చుకుంటున్నామని చెప్పారు. బోరు మరమ్మతులు పూర్తయ్యే వరకూ ట్యాంకరు ద్వారానైనా నీటిని సరఫరా చేయాలని కోరుతున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి కె.హనుమంతరావును సంప్రదించగా మరమ్మతుకు గురైన బోరు రిపేరు పనులు చేయిస్తున్నామని చెప్పారు. దీని ద్వారా తాగునీటిని సరఫరాను మంగళవారం నుంచి పునరుద్ధరించనున్నట్టు తెలిపారు. కాగా లోవోల్టేజ్ సమస్యతో ఇబ్బందిపడుతున్నామని చెప్పారు. వాతావరణం బాగున్న సమయంలో ఉన్నా అర్ధరాత్రి వోల్టేజ్ తగ్గుతోందని వాపోయారు. దీంతో తరచూ విద్యుత్ గృహోపకరణాలు మరమ్మతులకు గురవుతున్నాయని, సమస్య పరిష్కారానికి సంబంధిత అధికారులు తక్షణం చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

రూ.9 లక్షలతో సంఘం పాక స్కూల్ అభివృద్ధి

పాఠశాలను ప్రారంభించిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు


ఆధునీకరించిన స్కూల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వాసు


రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం 4వ డివిజన్‌లో రౌండ్‌టేబుల్ ఇండియా సీఎస్ఆర్ నిధులు రూ.9 లక్షలతో ఆధునీకరించిన సంఘం పాక స్కూల్‌ను ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు ప్రారంభించారు. సోమవారం తాడేపల్లిగూడెం టీడీపీ పరిశీలకుడు నల్లా చిట్టిబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. కోరిన వెంటనే రౌండ్‌టేబుల్ ఇండియా వారు పాఠశాల శ్లాబ్ లీకేజీ పనులు, మరుగుదొడ్ల అభివృద్ధి తదితర పనులు రూ.9 లక్షలతో చేపట్టారని అభినందించారు. చిట్టిబాబు మాట్లాడుతూ ఎమ్మెల్యే వాసు హయాంలో రాజమహేంద్రవరం పూర్తిస్థాయిలో అభివృద్ధి సాధిస్తుందన్నారు. ఈ సందర్భంగా రౌండ్ టేబుల్ ఇండియా చైర్మన్ మోహన్, వైస్ చైర్మన్ వరుణ్‌జైన్, సెక్రటరీ సూర్య శ్రీనివాస్, ఆది శంకర్, స్కూల్ హెచ్ఎం దేవియశోదలను ఎమ్మెల్యే వాసు సత్కరించారు. ఇదిలా ఉండగా స్థానిక పుష్కరాల రేవు వద్ద జరిగిన స్వర్ణాంధ్ర మొబైల్ అన్నదాన సేవల్లో ఎమ్మెల్యే వాసు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మరో గౌరవ అతిథి అడిషనల్ ఎస్పీ బీఎం మురళీకృష్ణతో కలిసి 250 మందికి పండ్లు పంపిణీ చేసి అన్నదానం చేశారు. ఈ సందర్భంగా స్వర్ణాంధ్ర సేవలను ఎమ్మెల్యే కొనియాడారు. మూలనిధికి రూ.లక్ష ప్రకటించిన సీఏ రెడ్డి, రూ.10 వేలు ప్రకటించిన మెహర్‌ఖురు, గ్రంథి వెంకటేశ్వరరావులకు సంస్థ నిర్వాహకుడు రాంబాబు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమాల్లో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్, బుడ్డిగ శ్రీనివాస్, జక్కంపూడి అర్జున్, యాళ్ల శ్రీనివాస్, బుడ్డిగ రవి, గూటాల సంజీవ్, ఉప్పలూరి జానకిరామయ్య, స్వర్ణాంధ్ర వ్యవస్థాపకుడు పదాల రామిరెడ్డి(రాఘవపాలెం), నిమ్మగడ్డ గోవింద్, ఎస్ఐసీఆర్ ట్రేడర్స్ అనితా నరసింహ తదితరులు పాల్గొన్నారు.

భారత్ క్రికెట్ ప్రపంచ కప్ సాధించడంపై హర్షం


వాహనదారులకు స్వీట్లు పంచుతున్న విద్యార్థినులు

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): భారత మహిళా క్రికెట్ జట్టు ప్రపంచ కప్‌ను సాధించడాన్ని హర్షిస్తూ నగరంలో రాజమహేంద్రి మహిళా కళాశాల విద్యార్థినులు వేడుక నిర్వహించారు. సోమవారం ఉదయం కళాశాల నుంచి ర్యాలీగా జాతీయ జెండాలు పట్టుకుని గోకవరం బస్టాండ్ అంబేడ్కర్ విగ్రహం వరకు వెళ్లారు. అంబేడ్కర్ విగ్రహానికి కళాశాల చైర్మన్ టీకే విశ్వేశ్వర్‌రెడ్డి, డైరెక్టర్ టి.శ్రీవిద్య, సౌందర్య పూలమాలలతో నివాళులర్పించారు. ప్రపంచ కప్‌లో సౌతాఫ్రికాపై భారత మహిళా జట్టు సాధించిన విజయం ఒక చరిత్రగా వారు అభివర్ణించారు. వారి విజయాన్ని చూసి ప్రపంచ మొత్తం గర్వపడుతుందన్నారు. రాజమహేంద్రి విద్యార్థినులు భారత మహిళా క్రికెట్ జట్టుకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా స్థానికులతోపాటు వాహనదారులకు స్వీట్లు పంచారు.

వైసీపీ కోటి సంతకాల సేకరణ


బూరుగుపూడిలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం

కోరుకొండ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని బూరుగుపూడిలో వైసీపీ కోటి సంతకాల ప్రజా ఉద్యమం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ గణేసుల పోసియ్య, కంటె తేజ, పిల్లా కృష్ణ, మునిసిబు, చోంగ వెంకన్న, వానాకా లవ, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
మంగళవారం 4 నవంబరు 2025 | 5





కొవ్వూరులో శివలింగానికి భక్తుల అభిషేకం



చేర నీ పాద దీపం..

తూర్పుగోదావరి జిల్లా కడియపులంకలో కార్తీక సోమవారం పర్వదినాన కోటి దీపోత్సవం నిర్వహించారు. శివపార్వతుల శాంతి కల్యాణం, ఆంజనేయస్వామి నక్షత్రపూజలు వైభవోపేతంగా జరిగాయి. వేదమంత్రాల మధ్య శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి ఆంజనేయస్వామి ఆలయకమిటీ అధ్యక్షుడు పల్ల సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో అఖండ దీపారాధన ప్రారంభించారు. - కడియం





జాంపేట శివయ్య

కాపాడు.. కార్తీక దామోదరా..

పవిత్ర గోదావరి తీరం హరహర మహాదేవ.. శంభో శంకరా అంటూ దేవదేవుడి నామ స్మరణతో మారుమ్రోగింది. కార్తీక మాసం సోమవారం మహాశివుడికి అత్యంత ప్రీతికరమైన రోజు కావడంతో భక్తులు వేకువజాము రెండుగంటల నుంచే కోటిలింగాల రేవు, చింతాలమ్మఘాట్ ,పుష్కరాల రేవు, సరస్వతి ఘాట్, గౌతమి ఘాట్లలో కార్తీక స్నానమాచరించి దీపాలు నదిలో వదిలారు. కాపాడు కార్తీక దామోదరా అంటూ వేడుకున్నారు. - రాజమహేంద్రవరం సిటీ



పుష్కరఘాట్‌లో భక్తజనం





పీజీఆర్ఎస్‌లో అర్జీదారుల సమస్యలు వింటున్న కలెక్టర్ కీర్తి చేకూరి, జేసీ మేఘా స్వరూప్

అర్జీలు వెంటనే పరిష్కరించాలి

పీజీఆర్ఎస్‌లో కలెక్టర్ కీర్తి చేకూరి

రాజమహేంద్రవరం రూరల్ నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను పరిశీలించి నాణ్యతతో కూడిన పరిష్కారం చూపించాలని కలెక్టర్ కీర్తి చేకూరి అధికారులకు సూచించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో ప్రజల నుంచి 200 అర్జీలను స్వీకరించారు. అర్జీదారులు తమ సమస్యలను కలెక్టర్‌కు విన్నవించుకున్నారు. మొంథా తుఫాన్ కారణంగా గతవారం పీజీఆర్ఎస్ రద్దు చేయడంతో ఈ వారం తాకిడి పెరిగింది. పెద్ద ఎత్తున అర్జీదారులు కలెక్టరేట్‌కు చేరుకున్నారు. చాలీచాలనీ ఇరుకు సందులో తోసుకుంటూ అర్జీలు పట్టుకుని క్యూకట్టారు. చివరకు కలెక్టర్ వద్దకు చేరుకుని తమ సమస్యను విన్నవించారు. గతంలో ప్రతి సోమవారం బస్టాండ్ నుంచి కలెక్టరేట్‌కు ఒక బస్ సర్వీసు ఉండేది. ప్రస్తుతం దానిని నిలుపుదల చేయడంతో ఆటోలకు డబ్బులు చెల్లించలేక అర్జీదారులు ఇబ్బందిపడుతున్నారు. కలెక్టర్ ప్రతి సోమవారం ఒక బస్ సర్వీస్ ఉండేలా చర్యలు తీసుకోవాలని అర్జీదారులు కోరారు. ఇటీవల మొంథా తుఫాన్ ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కొన్న అధికారులను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో జేసీ వై.మేఘాస్వరూప్, డీఆర్వో టీ సీతారామమూర్తి, డీఎస్పీ విద్య, సీపీవో ఎల్.అప్పలకొండ తదితరులు పాల్గొన్నారు.

పనులు వేగవంతం చేయాలి

జిల్లాలో జల్ జీవన్ మిషన్, స్వచ్ఛభారత్ మిషన్ పథకాల క్రింద మంజూరైన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశించారు. కలెక్టరేట్‌లో జల్‌జీవన్ మిషన్ పనులపై సమీక్షించారు. జల్ జీవన్ మిషన్ కింద రూ.2,315 కోట్లతో 1168 పనులు మంజూరయ్యాయని వీటిలో 190 పనులు పురోగతిలో ఉన్నాయని తెలిపారు. 2026 మార్చి నాటికి పనులు పూర్తి చేయాలన్నారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ గిరి, జడ్పీ డిప్యూటీ సీఈవో రాంగోపాల్ పాల్గొన్నారు.



సమస్య వింటున్న ఎస్పీ నరసింహ కిశోర్

ఎస్పీ గ్రీవెన్స్‌కి 40 ఫిర్యాదులు

రాజమహేంద్రవరం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం పబ్లిక్ గ్రీవెన్స్ నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులతో ఎస్పీ నరసింహ కిశోర్ మాట్లాడి 40 అర్జీలు స్వీకరించారు. అర్జీదారుల సమస్యలపై ఆరా తీశారు. సంబంధిత పోలీస్‌స్టేషన్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ఆయా ఫిర్యాదులపై సూచనలు చేశారు.



అక్రమంగా సాగినా : నాడు పోలవరం కాలువ గట్టు వద్ద మట్టి తరలింపు(ఫైల్)



మట్టి పెట్టేశారు!

కొండలు కరిగాయ్

అనుమతుల్లేకుండా మింగుడు..



- ఉమ్మడి జిల్లాలో పోలవరం మట్టిని మింగేశారు
- రూ.350 కోట్లకుపైగా మట్టి మాయం
- కోట్లు వెనకేసుకున్న వైసీపీ నేతలు
- ప్రభుత్వం మారి ఏడాదిన్నర
- అక్రమార్కులపై ఇంత వరకూ చర్యల్లేవ్
- తాజాగా రూ.300 కోట్లు మట్టి దోపిడీ
- పశ్చిమ,కృష్ణా జిల్లాల్లో అధికారుల నిర్ధారణ

(కాకినాడ,ఆంధ్రజ్యోతి) ఒకటి కాదు రెండు కాదు కాదు..ఏకంగా రూ.350 కోట్లు.. గత ప్రభుత్వ హయాంలో ఉమ్మడి జిల్లాలో కొందరు వైసీపీ నేతలు కొల్లగొట్టేసిన పోలవరం మట్టి విలువ ఇది.. అధికారం అండతో అనుమతుల్లేకుండా రియల్ ఎస్టేట్, ఇళ్ల స్థలాల చదునుకు అడ్డగోలుగా విక్రయించి సంపాదించింది అంతకుమించే. ఈ మట్టిని బొక్కేసిన అక్రమార్కులపై ఇప్పటికీ కనీస చర్యలు లేకపోవడం విస్మయపరుస్తోంది. ప్రభుత్వం మారిన వెంటనే దీనిపై విచారణ జరుగు తుందని భావిస్తే ఇంతవరకు ఆ ఊసే లేదు. ఒకరకంగా చెప్పాలంటే అప్పటి మట్టి అక్రమా లను మట్టుపెట్టేశారనే ఆరోపణలు వ్యక్త మవు తు న్నాయి. తాజాగా ఉమ్మడి పశ్చిమ, కృష్ణా జిల్లాల్లో వైసీపీ హయాంలో పోలవరం మట్టి అక్రమ తవ్వకాలు రూ.300 కోట్లు అని నిర్ధారణ అయిన నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో చోటు చేసుకున్న రూ.350 కోట్ల అక్రమ తవ్వకాల సంగతేంటనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి.

కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల పరిధిలో పోలవరం ఎడమ ప్రధాన కాలువ వందల కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. సీతానగరం మండలం పురుషోత్తపట్నం దగ్గర మొదలయ్యే ఈ కాలువ గోకవరం, కోరుకొండ, రాజానగరం, గండేపల్లి, ప్రత్తిపాడు, జగ్గంపేట, గొల్లప్రోలు, శంఖవరం, తొండంగి, తుని మండలాల మీదుగా పయనిస్తోంది. గత టీడీపీ ప్రభుత్వంలో ఈ కాలువను 18 మీటర్ల లోతు వరకు తవ్వారు. దీంతో దాదాపు నాలుగు కోట్ల క్యూబిక్ మీటర్ల మట్టి వచ్చింది. కాలువ వెంబడి భూముల్లో 15 అడుగుల ఎత్తు వరకు మట్టి మేటలు వేశారు.2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక క్రమేపీ ఆ మట్టి కొండలు కరిగిపోతూ వచ్చాయి. అప్పటి అధికార పార్టీ ఎమ్మెల్యేలు, ఇతర నేతలు ఈ మట్టిపై వాలిపోయారు. ప్రధానంగా రాజానగరం, ప్రత్తిపాడు, పిఠాపురం, తుని నియోజకవర్గాల పరిధిలో పోలవరం మట్టిని వైసీపీ ఐదేళ్లలో వేలాది టిప్పర్లలో తరలించేశారు. టిప్పర్ మట్టిని రూ.8 వేలకు కాకినాడ, రూ.12 వేలకు తాళ్లరేవు, యానాం, రూ.4 వేలకు పిఠాపురం, రూ.15 వేలకు కోనసీమలో అనేక రియల్‌ఎస్టేట్ స్థలాల చదునుకు విక్రయించి కోట్లు గడించేశారు. ప్రత్తిపాడు,పిఠాపురం నియోజకవర్గాల పరిధిలో చెందుర్తి జాతీయరహదారి పక్కనే పోలవరం కాలువ వెంబడి కోటిన్నర లక్షల క్యూబిక్‌మీటర్ల మట్టి మేటలు,తునిలో 70 లక్షలకుపైగా క్యూబిక్‌మీటర్ల మట్టి నిల్వలను కాజేశారు. దీనంతటినీ అప్పట్లో ముగ్గురు ఎమ్మెల్యేలు తమ అనుచరుల ద్వారా యథేచ్ఛగా తరలించుకుపోయారు.

నిబంధనల ప్రకారం పోలవరం కాలువ మట్టిని తవ్వాలంటే జలవనరులశాఖ అనుమతి తీసుకోవాలి. కానీ గత వైసీపీ ప్రభుత్వంలో అనుమతుల్లేకుండానే మట్టి కొండలు కొల్లగొట్టారు.గనులు, జలవనరులశాఖ అధికారులు కమీషన్లు పుచ్చుకుని కళ్లు మూసుకోవడంతో పోలవరం మట్టి 95 శాతానికి పైగా మాయమైపోయింది. ఒక ప్పుడు భారీ మేటలున్న ప్రాంతాల్లో ఇప్పుడు ఖాళీ స్థలాలు కనిపిస్తున్నాయి. తూర్పుగోదావరి, కాకినాడ జిల్లాల్లో ఆరున్నర కోట్ల క్యూబిక్ మీటర్ల మట్టి మాయమైపోయింది. పిఠాపురం నియోజకవర్గం యు.కొత్తపల్లి మండలం కొమరిగిరిలో 350 ఎకరాల్లో అప్పటి సీఎం జగన్ చేతుల మీదుగా 2021 డిసెంబర్ 25న పేదలకు ఇళ్లస్థలాలు పంచారు. ఈ భూములు సముద్రానికి అతిసమీపంలో లోతట్టులో ఉన్నాయి. ఈ లేఅవుట్‌ను లక్షల క్యూబిక్ మీటర్ల మట్టితో చదును చేశారు. ఇందుకోసం గొల్లప్రోలు మండలం చెందుర్తి జాతీయరహదారిని ఆనుకుని ఉన్న పోలవరం కాలువ మట్టిని అప్పటి కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి వేలాది టిప్పర్లలో తరలించి కోట్లలో మెక్కేశారు. అప్పట్లో కాకినాడ కీలకనేత ఒక్కరే పోలవరం మట్టిలో రూ.6 కోట్ల వరకు మింగేశారు.

ఎందుకిలా..

ప్రభుత్వం మారి దాదాపు ఏడాదిన్నరవుతోంది. కానీ ఇంతవరకు పోలవరం మట్టి అక్రమాలపై ప్రభుత్వం కనీసం దృష్టిసారించలేదు. రూ.350 కోట్లకుపైగా విలువైన మట్టిని అప్పటి నేతలు అక్రమంగా అమ్మేసుకున్నా ఇంత వరకు విచారణ చేపట్టకపోవడంతో అక్రమార్కులు దర్జాగా ఉన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరిలో పోలవరం మట్టిని వేలం వేస్తే రూ.350 కోట్ల వరకు రాబట్టవచ్చని 2019లో అధికారులు లెక్కగట్టారు. కానీ అప్పటి ప్రభుత్వం ఈ మట్టంతా తమ పార్టీ నేతలకు దోచిపెట్టింది. పైగా ఈ దోపిడీపై అప్పట్లో ప్రతిపక్ష హోదాలో టీడీపీ పోరాటం చేసింది. ఇప్పుడు చేతిలో అధికారం ఉన్నా కనీసం మట్టి అక్రమాలపై విచారణకు ఆదేశించకపోవడం విమర్శలకు తావిస్తోంది.

మట్టిలో కలిపేశారా?

కాకినాడ నగరంలో గత వైసీపీ హయాంలో రూ.450 కోట్లకుపైగా విలువైన టీడీఆర్ బాండ్ల జారీపై విజిలెన్స్ నివేదిక సిద్ధమైంది. రేషన్ బియ్యం కుంభకోణంపై సిట్, ఆడుదాం ఆంధ్రా అవినీతిపై విజిలెన్స్ విచారణ చేపట్టింది. పోలవరం మట్టి అక్రమాలపై ఏ విచారణ లేదు. ఉమ్మడి పశ్చిమ, కృష్ణా జిల్లాల్లో 1.21 కోట్ల క్యూబిక్ మీటర్లు రూ.300 కోట్ల విలువైన పోలవరం మట్టి దోపిడీకి గురైందని తాజాగా అక్కడ జలవనరుల శాఖ అధికారులు నిర్ధారించారు. కానీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో రూ.350 కోట్లకుపైగా విలువైన మట్టిని మింగేసిన అక్రమార్కులపై కనీసం అధికారులు కూడా ఉలకడం లేదు. దీంతో పోలవరం మట్టి అక్రమాలను మట్టుపెట్టేశారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



సూపర్ GST మాయ!

అంతంతమాత్రంగా సూపర్ జీఎస్టీ అమలు

- కానరాని జీఎస్టీ తగ్గింపు
- పాత ధరలకే అమ్మకాలు
- పాత స్టాకు పేరిట దోపిడీ
- మోసపోతున్న కొనుగోలుదారు
- అధికారుల చర్యలు శూన్యం
- ఆన్‌లైన్‌లోనూ అయోమయం

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి) కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ నుంచి సామాన్యులకు భారీ ఉపశమనం కలిగించి నెల దాటింది. ఇప్పటికీ సూపర్ జీఎస్టీ ఫలాలు సామాన్యుడికి దక్కడం లేదు. ప్రభుత్వాల ఆదేశాలతో యంత్రాంగం ఓ వారం హడావుడి చేసి చతికిలబడింది. మొన్నటి వరకూ పండుగ ఆఫర్లు అంటూ ఊదరగొట్టిన వ్యాపారులు.. ఇప్పుడు ప్రత్యేక తగ్గింపు అంటూ యథావిధిగా మోసపు ఉదారత చాటుకుంటున్నారు. మరి తగ్గిన జీఎస్టీ ఎంత? అసలు అంతకు ముందు ధర ఎంత? కేంద్ర ప్రభుత్వం తమకు కల్పించిన మేలుతో లాభం ఎంత సమకూరింది? అనే ప్రశ్నలకు సమాధానం ప్రశ్నగానే ఉండి పోతోంది. వ్యాపారులు మాత్రం తమ చాకచక్యాన్ని ప్రజలపై రుద్దుతూనే ఉన్నారు. కేంద్ర ప్రభుత్వం మాత్రం గతంలో ఉన్న ఐదు స్లాబులను రెండుకు తీసుకొచ్చాం..జనానికి భారీగా ఒనగూరుతుందని చెప్పింది. ఈ ధరల మోళీ జీఎస్టీ సూపరట! సేవింగ్స్ ఎక్కడట? అనే సందేహాన్ని నివృత్తి చేయలేక పోతోంది.ఈ గందరగోళం నడుమ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో రోజుకు జనం కోట్లాది రూపాయలు నష్టపోతూనే ఉన్నారు.

వ్యాపారుల మాయాజాలం..



జీఎస్టీ తగ్గక ముందు ఎంత ధర, తర్వాత ఏ మేరకు తగ్గిందనే విషయాలు దుకాణాల్లో ఎక్కడా కనబడడం లేదు. ఆన్‌లైన్ ప్లాట్‌ఫాంలలో అయితే అంతా అయోమయమే నడుస్తోంది. అసలు ధరను అమాంతం పెంచేసి భారీ తగ్గింపును చూపిస్తుంటారు. ఇప్పుడు కూడా ఆ మాదిరిగానే ధరలు ఉండడంతో జీఎస్టీ వల్ల తమకు ఏమి ఒరిగిందో వినియోగదారుడికి బోధ పడడం లేదు. మొన్నటి వరకూ పండుగ ఆఫర్ల పేరుతో అంతా కలగాపులగం చేసే శారు. జీఎస్టీ తగ్గింపు ఎంత, వ్యాపారి ఇస్తున్న ఆఫర్ ఎంత? అనే వాటిపై స్పష్టత లేకుండాపోయింది. జీఎస్టీని కేంద్ర ప్రభుత్వం భారీగా తగ్గించింది. గతంలో ఐదు స్లాబులుగా ఉన్న పన్నులను 5, 12% రెండు స్లాబులకు తెచ్చింది. దీనిలో కారుల నుంచి బిస్కట్ల వరకూ దాదాపు 375 వస్తువులపై 5 నుంచి 10 శాతం వరకూ పన్నుపోటు తగ్గింది. కొన్నిటికి పన్ను సున్నా చేశారు. అయితే ఆ మేరకు వినియో గదారుడికి ఎంత లబ్ధి చేకూరిందో సూపర్ జీఎస్టీ అమల్లోకి వచ్చి నెల దాటినా స్పష్టత కొరవడింది. ఆన్‌లైన్ ప్లాట్‌ఫాంలలో మరీ దారుణంగా పరిస్థితి నడుస్తోంది. వాస్తవ ధర నిర్ధారణలో స్పష్టత లేకపో వడంతో రూ.5 విలువ చేసే పెన్‌ని రూ.5 వేల ధర చూపించి 99 శాతం డిస్కౌంట్ ఇచ్చేస్తున్నామని రూ.50 ధర పెడుతున్నారు. దీని వల్ల ఇప్పుడు జీఎస్టీ ఎంత తగ్గించారో కూడా తెలియడం లేదు.

మందుల్లో మోళీ..

ఇవాళ మందుల ఖర్చు చూసి రోగం మరింత ముదిరిపోతోంది. ఓ వైపు అధిక శాతం డాక్టర్లు మందులతో చీటీలను పూర్తిగా నింపేస్తుంటే.. మరోవైపు మందుల దుకాణాల వాళ్లు ఎడాపెడా దోచేస్తున్నారు. చాలా ఆస్పత్రుల్లో సొంత మెడికల్ షాపులు అదనపు వ్యాపారంగా మారిపోయింది. బయట షాపుల్లో ఎమ్మార్పీపై ఏకంగా 20 శాతం వరకూ తగ్గింపు ఇస్తామంటూ వ్యాపారస్తులు పోటీ పడుతుంటారు. ఆస్పత్రుల్లోని మెడికల్ షాపుల్లో ఆ రాయితీ వర్తించడం లేదు. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం మందులపై జీఎస్టీని గణనీయంగా తగ్గించింది. అత్యవసర మందులపై పన్ను ఎత్తేసింది. కానీ ప్రజలకు మాత్రం ఆ మేరకు జేబుకు ఆదా కనబడడం లేదు.ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 3 వేల వరకూ మందుల షాపులు ఉండగా.. 150 వర కూ పెద్ద దుకాణాలు ఉన్నాయి. అత్య వసర మందులతో పాటు సాధారణ మందులను ఒకే చీటీలో రాస్తారు. దీంతో సందట్లో సడేమియా మాదిరిగా అత్యవసర మందులకు జీఎస్టీ తగ్గింపు ఇవ్వడం లేదు.



అంతా గందరగోళం

దుకాణదారులు జీఎస్టీ మార్పులను అమలు చేయడం లేదు. ఏదో ఒకటి రెండు వస్తువులపై తగ్గింపును చూపుతూ అధిక శాతం వస్తువులపై దోపిడీ సాగుతోంది. కిరాణా తదితర సరుకుల విషయంలో ఇదే నడుస్తోంది. కొందరు వ్యాపారులు పాత స్టాకు, పాత ధరలకే హోల్‌సేల్‌గా కొన్నా మంటూ ధరలు తగ్గించకపోవడం గమనార్హం. సబ్బులు, టూత్‌పేస్ట్, బిస్కట్లు, లేస్, బింగోస్ వంటి వాటి విషయంలో ఎఫ్ఎంసీజీ కంపెనీలు ధరలు తగ్గించలేదు. అయితే వీటి పరిమాణాన్ని పెంచామని చెబుతూ గందరగోళానికి తెరలేపుతున్నాయి. పాలు, ఆహార పదార్థాలు, హోటళ్లు, నిత్యావసరాల్లో వేటిపై జీఎస్టీ ఎంత తగ్గిందో ఇప్పటికీ అయోమయంగానే ఉంది. సెప్టెంబరు 22 నుంచి సూపర్ జీఎస్టీ అమల్లోకి రాగా ఓ వారం రోజులు అధికారులు పరుగులు పెట్టారు. తర్వాత యథావిధిగా పట్టు వదిలేశారు.

జీఎస్టీ తగ్గలేదా.. ఫిర్యాదు చేయండి

జీఎస్టీ అమలుకాని పక్షంలో కొనుగోలుదారుడు ఫిర్యాదు చేసే అవకాశం ఉంది. ఈ విషయం చాలా మందికి తెలియదు. తగ్గిన పన్నుల ప్రకారం ధరలు నిర్ణయించి అమ్మకాలు సాగించకపోతే కొనుగోలుదారుడు నేషనల్ యాంటీ ప్రాఫెటరింగ్ అథారిటీకి ఫిర్యాదు చేయవచ్చు. అయితే ఇలాంటి ఒక సంస్థ ఉందని వందలో ఒక్కరికి కూడా తెలియని పరిస్థితి ఉంది. ఇప్పటికీ దీనిపై యంత్రాంగం అవగాహన కల్పించలేదు. అసలు అధికారుల్లో అధిక శాతం మందికి ఆ సంస్థ గురించి తెలియదు. బిల్లులు ఇవ్వకపోయినా వాణిజ్య పన్నుల శాఖ పట్టించుకున్న దాఖలాలు లేవనే చెప్పవచ్చు. అటు ఔషధ నియంత్రణ శాఖ అసలు ఉందా? అనే తీరు కనబడుస్తోంది.

జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా సత్యనారాయణ

నాలుగు రోజుల సస్పెన్స్‌కు తెరదించిన అధికారులు



రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధనాసుపత్రి (జీజీహెచ్) సూపరింటెండెంట్‌గా జనరల్ మెడిసిన్ హెచ్‌వోడీ డాక్టర్ పీవీవీ. సత్యనారాయణను నియమిస్తూ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ ఉన్నతాధికారులు సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. పూర్తి అడిషనల్ ఛార్జ్ (ఎఫ్ఏసీ) హోదాలో ఆయన జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తించనున్నారు. రాజమహేంద్రవరం మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా కొనసాగుతూ, జీజీహెచ్‌కు ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్‌గా వ్యవహరించిన డాక్టర్ సౌభాగ్యలక్ష్మి గత నెల 31వ తేదీన ఉద్యోగ విరమణ చేసిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి జీజీహెచ్‌కు ఎవరినీ సూపరింటెండెంట్‌గా నియమించలేదు. అత్యవసర సేవల్లో అత్యంత ప్రధానమైన, వైద్యపరమైన పాలనా విధులను పర్యవేక్షించాల్సిన ఈ కీలకమైన పోస్టు విషయంలో ఉన్నతాధికారులు మీనమేషాలు లెక్కించారు. చివరకు నాలుగు రోజుల సస్పెన్స్‌కు తెరదించుతూ డాక్టర్ పీవీవీ సత్యనారాయణను సూపరింటెండెంట్‌గా నియమించారు. ఆయన మంగళవారం బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉంది.

'నన్నయ'లో రెజ్లింగ్ పోటీలు



దివాన్‌చెరువు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో రెజ్లింగ్ పురుష, మహిళల అంతర్‌కళాశాలల పోటీలు, విశ్వవిద్యాలయం జట్టు ఎంపికలు సోమవారం నిర్వహించారు. ఈ పోటీలను వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ ప్రారంభించారు. విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాలల నుంచి 51 మంది పురుష, మహిళ క్రీడాకారులు పాల్గొన్నారు. మహిళల ఫ్రీస్టైల్ విధానంలో 50 నుంచి 76 కిలోల కేటగిరి వరకూ జరిగాయి. వారిలో ఉత్తమ ప్రతిభ కనబరచిన క్రీడాకారులను విశ్వవిద్యాలయం జట్టుగా ఎంపికచేసి ఈ నెల 27 నుంచి 30 వరకూ రాజస్థాన్‌లో కోటా విశ్వవిద్యాలయంలో జరిగే సౌత్ జోన్ పోటీలకు పంపుతారు. అలాగే రెజ్లింగ్ పురుషుల ఫ్రీస్టైల్ విధానంలో 57 కిలోల నుంచి 125 కి లోల వరకూ క్రీడాకారులు పాల్గొని సత్తాచాటారు. రెజ్లింగ్ గ్రీకో రోమన్ విధానంలో 55 కిలోలనుంచి 130 కిలోల కేటగిరి వరకూ క్రీడాకారులు పాల్గొని సత్తాచాటారు. ఉత్తమ ప్రతిభ కనబరచిన వారిని విశ్వవిద్యాలయ జట్టుగా ఎంపిక చేసి పంజాబ్‌లోని చండీగఢ్ విశ్వవిద్యాలయంలో జరిగే సౌత్‌జోన్ పోటీలకు పంపుతారు.





కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో శ్రీ బాలాత్రిపుర సుందరీ సమేత సుందరేశ్వరస్వామికి అభిషేకాలు చేస్తున్న పండితులు

సుందరేశ్వరస్వామి ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు



నిడదవోలులో విశేష్ణ అలంకరణలో గోలింగేశ్వరస్వామి

శివనామస్మరణతో మార్మోగిన గోష్పాదక్షేత్రం

కార్తీకమాసం రెండో సోమవారం భక్తులతో కిటకిట

కొవ్వూరు, నవంబరు3(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సోమవారం పరమశివుడికి ప్రీతికరం కావడంతో గోదావరి తీరంలోని శైవ క్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. కార్తీకమాసం రెండో సోమవారం కావడంతో పట్టణ, పరిసర ప్రాంతాల నుంచి అధికసంఖ్యలో భక్తులు వేకువజాము నుంచి కొవ్వూరు గోష్పాదక్షేత్రానికి చేరుకున్నారు. గోదావరినదిలో పుణ్యస్నానాలు ఆచరించారు. ప్రధానస్నానఘట్టాలలో ఉన్నశివలింగాలకు నదీ జలాలతో అభిషేకాలు చేశారు. మహిళలు అరటి డొప్పలలో కార్తీకదీపాలు వెలిగించి గోదావరినదిలో విడిచిపెట్టారు. క్షేత్రంలోని రావిచెట్టు, తులసికోట, సుందరేశ్వరస్వామి ఆలయంలోని ధ్వజస్తంభం, నందీశ్వరుడివద్ద మహిళలు అధిక సంఖ్యలో కార్తీకదీపాలను వెలిగించారు. సుందరేశ్వరస్వామిని దర్శించుకుని పంచామృత అభిషేకాలు నిర్వహించారు. పండితులకు సాలగ్రామ, దీప దానాలను సమర్పించారు. క్షేత్రం లోని ఆలయాలతోపాటు, కొవ్వూరు పట్టణ, మండలం లోని గ్రామాలలో శైవ క్షేత్రాలు భక్తుల రద్దీతో కిటకిటలాడాయి. క్షేత్రంలో ఎటువంటి అవాంచనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పట్టణ సీఐ పి.విశ్వం ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

నిడదవోలులో విశేష పూజలు

నిడదవోలు(ఆంధ్రజ్యోతి): నిడదవోలు పట్టణంలో ఉన్న శ్రీ రాజరాజేశ్వరి స మేత గోలింగేశ్వరస్వామి, బాలాత్రిపుర సుందరి సమేత సోమేశ్వరస్వామి దేవాలయాలలో సోమ వారం కార్తీక సోమవారం కావడంతో తెల్లవారుజాము నుంచే స్వామివార్లకు అభిషేకాలు, అమ్మవార్లకు కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీకాకోళపు వెంకటేశ్వరరావు, లక్ష్మీ నరసింహశాస్త్రి వేద పండితుల ఆధ్వర్యంలో విశేష అభిషేకాలు నిర్వహించారు. భక్తులు తెల్లవారుజాము నుంచే స్వామివార్ల దర్శనానికి క్యూ కట్టారు. ఆలయాలు భక్తుల శివనామస్మరణతో మార్మోగాయి.

కొవ్వూరు రైల్వేస్టేషన్‌కు పూర్వ వైభవం తీసుకువస్తాం

● స్టేషన్ ఆధునీకరణకు రూ.17కోట్లు మంజూరు
● నూతనస్టేషన్ నిర్మాణం, ఫ్లాట్‌ఫారంల అభివృద్ధికి చర్యలు
● ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు



కొవ్వూరు రైల్వేస్టేషన్ పరిసరాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): కొవ్వూరు రైల్వేస్టేషన్ ఆధునీకరణకు రూ.17కోట్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు తెలిపారు. కొవ్వూరు రైల్వేస్టేషన్ ఆధునీకరణకు సంబంధించి సోమవారం రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజనీర్ శ్రీనివాస్, ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు స్టేషన్ ఆధునికీకరణకు సంబంధించి స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. కొవ్వూరు రైల్వేస్టేషన్‌లో కరోనా కారణంగా రైళ్లహాల్ట్‌లను నిలుపుదలచేసి, పునరుద్ధరించకపోవడంతో ఇప్పటికీ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై ఎంపీ పురందేశ్వరి ఆధ్వ ర్యంలో రైల్వే అధికారులకు కొవ్వూరులో రైళ్లను పునరుద్ధరించాలని కోరారు. దాని ఫలితంగా రెండు రైళ్ల నిలుపుదల చేయడానికి అనుమతులు ఇచ్చారు. మిగిలిన రైళ్లకు హాల్ట్ కల్పించాలని, 2027లో రానున్న గోదావరి పుష్కరాలను పురస్కరించుకుని రైల్వేస్టేషన్ ఆధునికీకరించి ఫ్లాట్ ఫారంలను పొడిగించాలని సంబంధిత అధికారులను, మంత్రులను నేను, ఎంపీ పురందేశ్వరి కోరామన్నారు. కొవ్వూరు రైల్వేస్టేషన్ ఆధునీకరణకు సంబంధించి రూ.17కోట్లు మంజూరు చేశామన్నారు. రైల్వేస్టేషన్ నూతన భవన నిర్మాణానికి, ఫ్లాట్‌ఫారంలు పొడిగించడానికి రైల్వే స్థలంతోపాటు, ప్రైవేటు వ్యక్తుల స్థలాలు అవసరమవుతాయన్నారు. భవన నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని రైల్వేశాఖకు ఇచ్చి, పట్టణంలో వేరే ప్రాంతంలో ఉన్న స్థలాన్ని రైల్వేస్థలాన్ని ప్రైవేటు వ్యక్తులు ఇచ్చేలా ప్రతిపాదనలు తయారుచేసి అధికారులకు పంపిస్తామ న్నారు. తొందరలో టెండరు ప్రక్రియ పూర్తిచేసి, పనులు ప్రారంభించాలని రైల్వే అధికారులను కోరారు. ఈస్టేషన్ కొవ్వూరు, మండలం తాళ్లపూడి, పోలవరం, దేవరపల్లి మండలాలకు అతి చేరువలో ఉంటుందన్నారు. విజయవాడ, వైజాగ్, హైదరాబాద్, చెన్నై ప్రాంతాలలో చదువుకునే సుమారు 5 మండలాల్లో 100కు పైగా గ్రామాల విద్యార్థులకు ఈ స్టేషన్ ఉపయోగపడుతుందన్నారు. రాబోయో రోజులలో కొవ్వూరు రైల్వేస్టేషన్‌కు పూర్వవైభవం తీసుకురానున్నామన్నారు. స్టేషన్ కు వచ్చే ప్రయాణికులకు అన్నిరకాల సదుపాయాలు సమకూర్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్, తహసీల్దార్ ఎం. దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

డివిజనల్ ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 21 ఫిర్యాదులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న తహసీల్దార్ అచ్యుతకుమారి

కొవ్వూరు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): డివిజనల్ ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్ - మీకోసం)లో 21 ఫిర్యాదులు స్వీకరించినట్లు కొవ్వూరు ఆర్డీవో కార్యాలయ కెఆర్‌సీ తహసీల్దార్ పి.అచ్యుతకుమారి తెలిపారు. కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో సోమవారం డివిజనల్ స్థా యి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. అచ్యుతకుమారి మాట్లాడుతూ ప్రజల నుంచి స్వీకరించిన ఫిర్యాదులు పరిష్కారంలో నూటికి నూరుశాతం నాణ్యతతోపాటు పూర్తి స్పష్టత ఉండాలన్నారు. ప్రజలు తమ ఫిర్యాదులను 1100 ట్రోల్‌ఫ్రీ నెంబరు ద్వారా, మీకోసం వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదులు అందిం చవచ్చునన్నారు. కార్యక్రమంలో వివిధ ప్రభుత్వశాఖల డివిజనల్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

చెల్లమ్మకు సాయం అందజేత

దేవరపల్లి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): దేవరపల్లి మండలం కురుకూరు గ్రా మానికి చెందిన చెదలవాడ చెల్లమ్మ ఇటీవల ఇళ్లు దగ్ధంకావడంతో సోమవారం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు ఆ కుటుంబాన్ని పరామర్శించి రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు మాట్లాడుతూ ఆ కుటుం బానికి ఇళ్లు మంజూరు చేస్తామని, ప్రభుత్వం నుంచి వచ్చే అన్నిసౌకర్యాలు కల్పిస్తామన్నారు.

మత్స్యకారులకు నిత్యావసరాల పంపిణీ



మత్స్యకారులకు నిత్యావసరాలు పంపిణీచేస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి, ఆర్డీవో రాణి సుస్మిత

కొవ్వూరు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ముందస్తు జాగ్రత్తలు పాటించడం ద్వారా తుఫాన్ నష్టాలను కొంతవరకు తగ్గించగలిగామని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. మొంథా తుఫాన్ కారణంగా కొవ్వూరు పట్టణ, మండలంలోని 995 మంది మత్స్యకారులకు సోమవారం నిత్యావసరాలను పంపిణీ చేశారు. మత్స్యకార కుటుంబానికి 50 కేజీల బియ్యం, నిత్యావసరాలను అందజేశారు. తుఫాన్ నాలుగు రోజులు అధికారులు ఎవ్వరూ నిద్రపోలేదన్నారు. ఆర్డీవో సుస్మిత డివిజన్‌లోని మూడు నియోజకవర్గాల్లో అన్నిశాఖల అధికారులను, నాయకులను సమన్వయం చేసుకుంటూ బాధ్యతలను నిర్వహించారు. సీఎం చంద్రబాబు అందించిన అవార్డు నా ఒక్కడిదే కాదు. తుఫాన్ విధులు నిర్వహించిన ప్రతి అధికారి, నాయకుల కష్టమేనన్నారు. ఎవ్వరి బాధ్యత వారు నిర్వహించారన్నారు. అధికారులందరికి అభినందనలు తెలియజేశారు. నియోజకవర్గంలో మొత్తం 1330మంది మత్స్యకారులు ఉన్నారన్నారు. మత్స్యకారులందరూ లైసెన్సు కలిగి ఉన్నట్లయితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేస్తున్న అన్ని పథకాలు పొందవచ్చునన్నారు. అదేవిధంగా కార్మికశాఖ ఆధ్వర్యంలో ఈశ్రమ పోర్టల్‌లో ఉచితంగా భీమా నమోదు చేసుకోవాలన్నారు. దీనివలన ఏదైనా ప్రమాదం జరిగితే ఇన్సూరెన్సూ పొందవచ్చునన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ బావన రత్నకుమారి, ఆర్డీవో రాణి సుస్మిత, సూరపనేని చిన్ని, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, సూర్యదేవర రంజిత్, కౌన్సిలర్లు, పిల్లలమర్రి మురళీకృష్ణ, బొండాడ సత్యనారాయణ, అర్జిల్లి రామకృష్ణ, బోడపాటి ముత్యాలరావు, తహసీల్దార్ ఎం.దుర్గాప్రసాద్, మత్స్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

తాళ్లపూడి,(ఆంధ్రజ్యోతి): ఇటీవల సంభవించిన మొంథా తుఫాన్ సమయంలో నష్టపోయిన వారికి ఆర్థిక సాయం అందజేసే కార్యక్రమం చేపట్టారు. తాళ్లపూడి, అన్నదేవరపేట గ్రామాల్లోని ప్రభుత్వం ఆసుపత్రులకు ఏసీలను బహూకరించే కార్యక్రమం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. మండలంలోని పోచవరం గ్రామానికి చెందిన ఇఫ్రాయిమ్ గ్లోబల్ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ బిషప్ గెడ్డం విలియమ్స్ ద్వారా మండలంలో 9 మందికి ఇళ్లు, మొంథా తుఫాన్‌కు పడిపోవడంతో వారికి ఒక్కొక్కరికీ 5వేల రూపాయల చొప్పున ఆర్థిక సహాయం అందించారు. తాళ్లపూడి, అన్నదేవరపేట గ్రామాలలోని ప్రభుత్వ ఆసుపత్రులకు చెరొక ఏసీని బహూకరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన పి4 కార్యక్రమంలో భాగంగా పలు పేద కుటుంబాలకు సహాయం అదించడంతోపాటు పలు అభివృద్ధి కార్యక్రమాలలో సైతం పాలు పంచుకున్నారని విలియమ్స్‌ను, ఆయన కుమారుడు మనీష్‌ను ఎమ్మెల్యే అభినందించారు. ఇటీవల సంభవించిన మొంథా తుఫానుకు చేపల వేటకు వెళ్లే అగ్నికుల క్షత్రియులు పనులు కోల్పోయిన వారిగా నియోజకవర్గంలో 1330 మందిని గుర్తించామని వారందరికీ ప్రభుత్వం తరుపున ఒక్కొక్కరికీ 50కేజీల బియ్యం, నిత్యావసర వస్తువులు త్వరలో అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిద్దాదుర్గారావు, అనపర్తి ప్రసాదు, గంటా కృష్ణ తహసీల్దార్ లక్ష్మీ లావణ్య, ఎంపిడివో వేణుగోపాలరెడ్డి, గెడ్డం మధుబాబు, రాహుల్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పునరావాస కేంద్రం వారికి సాయం అందజేత

గోపాలపురం(ఆంధ్రజ్యోతి):తుఫాన్ ప్రభావంతో ఇళ్లు నీట మునిగిన 51కుటుంబాలకు కూటమి ప్రభుత్వం చేయూతనందించింది. గోపాలపురం గ్రామంలో పునరావాస కేంద్రాలకు తరలించిన వారికి కూటమి నాయకులు ప్రభుత్వం విడుదలచేసిన సొమ్మును ఒక్కొక్కరికీ రూ.వెయ్యి చొప్పున కుటుం బానికి రూ.3వేలు చొప్పున సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామక మిటీ అధ్యక్షుడు భూరెడ్డి వాసు, మాజీ అధ్యక్షుడు జ్యేష్ట శ్రీధర్, యూనిట్ ఇన్‌ఛార్జ్ దుర్గాప్రసాద్, నీటిసంఘం అధ్యక్షుడు నారాయణరావు, వీఆర్వో లక్ష్మి, పంచాయతీ కార్యదర్శి అనురాధ ఉన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

● ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి

దేవరపల్లి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు పేర్కొన్నారు. దేవరపల్లి మండలం కురుకూరు, పల్లంట్ల గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే సోమవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు మాట్లాడుతూ రైతు పండించిన ప్రతీ ధాన్యం గింజను ప్రభుత్వం కొనుగో లు చేస్తుందని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఇటీవల తుఫాన్ వలన తడిచిన ధాన్యాన్ని కూడా రైతులు గిట్టుబాటు ధర ఇచ్చి కొనుగోలు చేస్తామన్నారు. మొక్కజొన్న, టొబాయి, అరటి, మినుముపంటలకు నష్టం వాటిల్లిందని మినుము మార్క్‌ఫేయిడ్ ద్వారా కొనుగోలు చేస్తామన్నారు. తుఫాన్‌ను ఎదుర్కోవడంలో సాహసోపేతమైన నిర్ణయాలవలన ఎక్కువ నష్టం జరుగకుండా చూడగలిగామన్నారు. కురుకూరులో జరిగిన అన్న వనసమారాధనలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు యలమాటి భాస్కరరావు, టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు కొయ్యలమూడి చిన బాబు, రాష్ట్ర మహిళా అధికార ప్రతినిధి కొయ్యలమూడి సుధారాణి, గ్రామ టీడీపీ అధ్యక్షుడు గాంధీ, మండలంలోని సొసైటీ అధ్యక్షులు ఉప్పులూరి రామారావు, కోడూరి వెంకటరత్నం, కలగర శ్రీనివాస్, మల్లెల వెంకటేశ్వరరావు, కొయ్యలమూడి చందు పాల్గొన్నారు.

నాటుసారా తయారు చేస్తున్న ఇద్దరి అరెస్టు

● కోర్టుకు తరలింపు

గోపాలపురం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): నాటుసారా తయారీ, రవాణా, వినియోగంపై ఉక్కుపాదం మోపుతానని ఎస్ఐ మనోహర్ హెచ్చరించారు. గోపాలపురం గ్రామశివారులో ఇద వ్యక్తులు నాటుసారా తయారు చేస్తున్నట్లు వచ్చిన విశ్వసనీయమైన సమాచారం మేరకు తన సిబ్బందితో కలిసి సోమవారం దాడి చేశానని అన్నారు. ఈ దాడిలో ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి 25లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నాటుసారా తయారికి వినియోగించే వస్తువులను ధ్వంసం చేశామన్నారు. ఇరువురుపై కేసు నమోదు చేసి కొవ్వూరు కోర్టుకు హాజరుపరిచినట్లు ఎస్ఐ తెలిపారు.

సుంకవల్లి సత్తిరాజుకు అక్షరశిల్పి అవార్డు



అక్షరశిల్పి అవార్డు తీసుకుంటున్న సత్తిరాజు

దేవరపల్లి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): దేవరపల్లి మండలం సంగాయి గూడెం గ్రామానికి చెందిన సామాజిక విశ్లేషకుడు సుంకవల్లి సత్తిరాజును విశ్వజనని ఫౌండేషన్ అక్షర శిల్పి అవార్డుతో సత్కరించింది. సోమవారం హైదరాబాదులోని పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్శిటీ లోని ఎన్‌టీఆర్ కళాప్రాంగణంలో రాజకీయ, కళా, సాంస్కృతిక సాహిత్య రంగాలకు చెందిన ప్రముఖుల మధ్య జరిగిన ఈ కార్యక్రమంలో సుంకవల్లి సత్తిరాజుకు అక్షర శిల్పి అవార్డు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సత్తిరాజు మాట్లాడుతూ అక్షరం ఒక ఆయుధమని, అక్షరంతోనే సమాజం వికసిస్తుందని తాను ఎన్నో పత్రికలకు 15వ ఏట నుంచే వేలాది వ్యాసాలు, వందలాది కవితలు రాశానన్నారు.

చోరీ కేసులో ముగ్గురు నిందితుల అరెస్టు



చోరీ కేసులో పట్టుబడిన నిందితులతో పోలీసులు

తాళ్లపూడి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని గజ్జరం గ్రామంలో గతనెలలో ఒంటరిగా ఉన్న మహిళ మెడలో గొలుసు చోరీకి పాల్పడిన నిందితులను సోమవారం తాళ్లపూడి పోలీసులు అరెస్టు చేశారు. ఎస్ఐ రామకృష్ణ వివరాల ప్రకారం.. గజ్జరం గ్రామంలో గత నెల 8న గన్నిన నరసమాంబ అనే వృద్ధురాలు ఇంటిలో ఒంటరిగా ఉండగా అపరిచిత వ్యక్తులు ముగ్గురు కేబుల్ టీవీ సరిగా రావడం లేదని తెలుపుతూ ఆమె ఇంటికి వచ్చారు. అయితే ఆమె టీవీ రిపేరు ఏమీ లేదని తెలుపగా తమకు సాక్ష్యం కోసం ఫొటో తీసుకోవాలని చెప్పి ఆమె దగ్గరికి వచ్చి మెడలోని గొలుసు లాక్కొని పారిపోయారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసును నమోదు చేశామన్నారు. సీఐ విజయ్‌బాబు పర్యవేక్షణలో క్రైమ్ స్టేషన్ ఎస్ఐ రవీంద్ర, ట్రైనీ ఎస్ఐ ఆదిత్య శ్రీనివాస్ దర్యాప్తు చేయగా సోమవారం బల్లిపాడు గ్రామం వద్ద షేక్ సుభానీ జానీ, దేశగిరి గంగరాజు, వడ్డి చరణ్‌రాజు సొత్తు, బైక్‌తో సహా పట్టుబడ్డారని తెలిపారు. నిందితులను రిమాండ్ నిమిత్తం కొవ్వూరు కోర్టుకు తరలించామని ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపారు. కాగా అపరిచిత వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలని, ఇళ్ల వద్దకు టీవీలు రిపేరు చేస్తాం, కేబుల్ కనెక్షన్ రిపేరు కోసం వచ్చామంటూ జనాభా తక్కువగా ఉన్న ఇళ్లను ఎంచుకుని దొంగతనాలు చేస్తున్న సంఘటనలు జరుగుతున్నాయని ప్రజలందరూ జాగ్రత్త వహించి అపరిచిత వ్యక్తులను ఇంటిలోకి రానివ్వవద్దని అన్నారు.

పెరవలి-కాపవరం రహదారి సర్వే



స్థానికులతో మాట్లాడుతున్న తహశీల్దార్ నిరంజన్, ఎంపీడీవో పద్మజ

పెరవలి, నవంబరు3(ఆంధ్రజ్యోతి): పెరవలి నుంచి కొత్తపల్లి మీదుగా కాపవరం రహదారి సర్వే చేయడానికి నిర్ణయించినట్టు తహశీల్దార్ నిరంజన్, ఎంపీడీవో పద్మజ తెలిపారు. ఇటీవల ఈ రోడ్డు వేయడానికి మంత్రి దుర్గేష్ శంకుస్థాపన చేశారు. ఈ రోడ్డులో ఆక్రమణలు పెరిగిపోయి రోడ్డు నిర్మాణానికి ఆటంకం కలుగుతుందని కొంత మంది ఆరోపణలు చేయడంతో ఇప్పటికే అనధికారికంగా సర్వే నిర్వహించి కొన్నిచోట్ల ఆక్రమణలు అన్న అనుమానంతో కొన్నింటిని ధ్వంసం చేశారు. దీంతో వారు తమకు న్యాయం చేయాలని రోడ్డుకు ఎంత అవసరమైతే అంతే తీసుకోవాలని పెరవలి నుంచి కాపవరం వరకు ఒకే విధానం అవలంబించాలని కోరడంతో ఈ మేరకు అధికారులు అంగీకరించారు.

ప్రతీఒక్కరు భద్రత చర్యలు పాటించాలి

ఎస్ఐ రవికుమార్

ఉండ్రాజవరం, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రతీఒక్కరూ భద్రత చర్యలు పాటించాలని ఎస్ఐ డి.రవికుమార్ చెప్పారు.సోమవారం మండలంలోని చివటం గ్రామంలో ప్రజలకు భద్రతా చర్యలపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం, సాయంత్రం మహిళలు వాకింగ్‌కు వెళ్లేటపుడు విలువైన బంగార వస్తువులు వేసుకోరాదని సూచించారు. బయటకు వెళ్లేటపుడు భద్రతా చర్యలు పాటించాలన్నారు. అపరిచితులతో మాట్లాడడం, ఫోన్‌కాల్స్ లిఫ్ట్ చేయడం వంటివి చేయరాదన్నారు. గ్రామం విడిచి దూరప్రాంతాలకు వెళ్లేటపుడు ఇంటి యజమానులు పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని ఎస్ఐ పేర్కొన్నారు. సైబర్ నేరగాళ్ల పట్ల జాగ్రత్త వహించాలన్నారు. కార్యక్రమంలో ట్రైనీ ఎస్ఐ నవీన్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి జీవీ సత్యనారాయణ, మహిళాపోలీసు రాజేశ్వరి పాల్గొన్నారు.

బాలదుర్గమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



దేవరపల్లి బాలదుర్గమ్మ ఆలయంలో బెల్లంతో తులాభారం

దేవరపల్లి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): దేవరపల్లిలో బాలదుర్గమ్మ ఆలయంలో కార్తీక సోమవారం కావడంతో ఉదయం నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించి, కార్తీక దీపాలు వెలిగించారు. ఈ సందర్భంగా త్యాజంపూడి గ్రామానికి చెందిన గంటా వెంకటలక్ష్మికి బెల్లంతో తులాభారం నిర్వహించి మొక్కుబడులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో బాలదుర్గమ్మ ఆలయ కమిటీ ఛైర్మన్ పైడికొండల సత్యనారాయణ, కోశాధికారి కామిశెట్టి దుర్గారావు, గారపాటి అప్పారావు, పిన్నమని వెంకటకృష్ణ, జాజిమొగ్గల ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

తీపర్రు గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ఎన్నిక



తీపర్రు గ్రంథాలయ అభివృద్ధి నూతన కమిటీ

పెరవలి, నవంబరు3(ఆంధ్రజ్యోతి): తీపర్రు శాఖా గ్రంథాలయ అభివృద్ధికి కృషి చేస్తానని గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడిగా ఎంపికైన శ్రీరామచంద్రమూర్తి పేర్కొన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయం వద్ద సోమవారం సాయంత్రం నూతన కమిటీ ప్రమాణ స్వీకారం అనంతరం గ్రామస్థులతో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతీ గ్రామంలో దేవాలయంతో పాటు గ్రంథాలయం ఎంతో అవసరమని ప్రతీ విద్యార్థి గ్రంథాలయాన్ని ఉపయోగించుకుంటే ఉన్నత స్థానాలకు చేరవచ్చునన్నారు. గ్రంథాలయాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేస్తానన్నారు. ఉపాధ్యక్షుడిగా బోగవల్లి నాగేశ్వరరావు,సెక్రటరీగా మిరియాల ధనప్రియ, జాయింట్ సెక్రటరీగా ర్యాలీ చిన త్రిమూర్తులతోపాటు 11 మంది సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో కంటిపూడి సూర్యనారాయణ, సింహాద్రి సత్యనారాయణ, ప్రత్తిపాటి ప్రసాద్‌కుమార్, బోగవల్లి బాబు, నందమూరి నారాయణరావు, మొగళ్లపు సీతారామ్, లైబ్రేరియన్ భూలక్ష్మి పాల్గొన్నారు.

టెన్నికాయిట్ జిల్లా జట్టుకు రామన్నపాలెం విద్యార్థుల ఎంపిక

దేవరపల్లి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామన్నపాలెంలో జూనియర్ బాలబాలికల టెన్నికాయిట్ జిల్లా సెలెక్షన్స్‌లో ఎంపికైన క్రీడాకారులు ఈనెల 7,8 తేదీల్లో బాపట్లలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని రాష్ట్ర శాప్ డైరెక్టర్ రవీంద్రనాథ్ తెలిపారు. ఎంపికైన బాలికలు ఆర్.సంస్కృతి, ఏ.శ్రీవల్లిక, ఎస్‌కే లద్దిపా, ఎం.ప్రియదర్శిని, ఆర్.సౌజన్యిక, బాలుర విభాగంలో రాజు, మహేశ్, బి.ఆనంద్, లారెన్స్ సందీప్, పోటీలకు ఎంపికైనట్టు పేర్కొన్నారు.

ముత్యాలమ్మ ఆలయ పునః నిర్మాణం



ప్రారంభోత్సవానికి సిద్ధమైన ముత్యాలమ్మ ఆలయం

తాళ్లపూడి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని రావూరుపాడు గ్రామంలో 200 సంవత్సరాల చరిత్ర ఉన్న గ్రామ దేవత ముత్యాలమ్మ ఆలయాన్ని రూ.50 లక్షలతో పునః నిర్మించారు. ఆలయ కమిటీ సభ్యులు సోమవారం ఆలయం వద్ద మాట్లాడుతూ గ్రామ దేవత ఆలయం శిథిలావస్థకు చేరడంతో ఆ ప్రాంగణంలోనే గ్రామస్థుల సహకారంతో నూతన ఆలయాన్ని నిర్మించామన్నారు. ఆలయ ప్రారంభోత్సవం సందర్భంగా ఈ నెల 5,6,7 తేదీల్లో హోమాలు, అమ్మవారి ఊరేగింపు, ప్రాణప్రతిష్ఠ కార్య క్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కొలిశెట్టి కుటంబీకులు, చీకట్ల కుటుంబీకులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కాళీకృష్ణకు తెలుగు బుక్ ఆఫ్ ఐకాన్ అవార్డు



అవార్డు అందుకుంటున్న కాళీకృష్ణ

దేవరపల్లి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): దేవరపల్లి గ్రామానికి చెందిన ఆర్యవైశ్య ప్రముఖుడు డాక్టర్ శ్రీకాకుళపు కాళీకృష్ణకు తెలుగు బుక్ ఆఫ్ ఐకాన్ అవార్డు దక్కింది. సోమవారం తాడేపల్లిగూడెంలో జరిగిన సిరిసిరి మువ్వ అవార్డు ప్రదానోత్సవంలో ఆయన ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ప్రస్తుతం కాళీకృష్ణ వాసవీ జాగృతి ఇంటర్నేషనల్ జిల్లా గవర్నర్‌గా, పొట్టి శ్రీరాములు పవిత్ర స్మృతి పరిరక్షణ సంస్థ ఉపాధ్యక్షుడిగా ఉన్నారు. ఆయనను గతంలో చెన్నై గ్లోబల్ యూనివర్శిటీ గౌరవ డాక్టరేట్‌తో సత్కరించింది. పొట్టి శ్రీరాములు సేవారత్న అవార్డు, ఎన్టీఆర్ కీర్తి పురస్కారం కూడా అందుకున్నారు.ఈ అవార్డు రావడంతో హర్షం వ్యక్తంచేశారు. మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామన్నారు.

రాజ్యాంగ దినోత్సవంపై విద్యార్థులకు అవగాహన



రాజ్యాంగ దినోత్సవంపై వక్తృత్వ పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

నిడదవోలు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులంతా భారత రాజ్యాంగంపై అవగాహన కలిగి ఉండాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బి.మేరీసుజాత అన్నారు.సోమవారం నిడదవోలులోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో భారత రాజ్యాంగ దినోత్సవంపై వ్యాసరచన, క్విజ్, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మనదేశానికి రాజ్యాంగమే దిక్సూచి అని అన్నారు. అనంతరం నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో రూష్యంత్, సాయి, మధు, వక్తృత్వ పోటీల్లో గణసాయి, వసంత్, నవనీత్, క్విజ్‌లో చంద్, సతీష్, నవనీత్ మొదటి మూడు స్థానాల్లో నిలిచారు.వీరంతా ఈ నెల 5న జరిగే జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొంటారని ప్రిన్సిపాల్ తెలిపారు.

'జోగి రమేష్ అరెస్టును రాజకీయం చేయడం తగదు'

కొవ్వూరు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): జోగి రమేష్ అరెస్టును వైసీపీ రాజకీయం చేయడం తగదని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. లిక్కర్ కేసులో సరైన ఆధారాలతో అరెస్టు చేశారని, తప్పు చేయకపోతే ఆధారాలతో నిరూపించుకోవాలన్నారు. ప్రతీ విషయాన్ని రాజకీయం అలవాటైపోయిందన్నారు. జే బ్రాండ్స్ పేరుతో నకిలీ మద్యం తయారు చేసి కోట్లాది రూపాయలు సంపాదించారన్నారు. అక్రమ అరెస్టులు చేయడం వైసీపీకి మాత్రమే తెలుసన్నారు. ప్రతి విషయాన్ని కులాలకు ఆపాదించి రాజకీయం చేయడం మానుకోవాలన్నారు.